www.vishalabharati.com
epaper:vishalabharati.com

# విశాల భారతి

శుక్రవారం, 7.06.2024, హైదరాబాద్ | తెలుగు దిన పత్రిక | సంపుటి: 2, సంచిక: 235






### రాష్ట్రంలో మూడు రోజుల పాటు...
## మోస్తరు వర్షాలు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో :** రాష్ట్రంలో రాగల మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. గురువారం మాత్రం కొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలతో పాటు భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించింది. ఇదే సమయంలో గంటకు 30 నుంచి 40కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది.శుక్ర, శనివారాల్లో కూడా దాదాపుగా ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ కేంద్రం సంచాలకులు విడుదల చేసిన ప్రకటనలో వివరించారు. గురువారం నైరుతి రుతుపవనాల ఉత్తర పరిమితి మెదక్, భద్రాచలం గుండా వెళ్తుందని తెలిపారు. మరోవైపు నైరుతి రుతుపవనాలు తెలంగాణ, కోస్తా ఆంధ్రప్రదేశ్లో మరికొన్ని ప్రాంతాల్లో ప్రవేశించాయి. రాబోయే మూడు నాలుగు రోజుల్లో నైరుతి రుతుపవనాలు కర్ణాటక, తెలంగాణ, కోస్తా ఆంధ్రప్రదేశ్లోని మిగిలిన ప్రాంతాల్లో కూడా ప్రవేశించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. దక్షిణ ఆంధ్రప్రదేశ్లో ఆయా పరిసర ప్రాంతాలలో కేంద్రీకృతమై ఉన్న ఉపరితల ఆవర్తనం గురువారం రాయలసీమ పరిసర ప్రాంతాల్లో సగటు సముద్ర మట్టానికి 3.1 కి.మీ. ఎత్తులో కొనసాగుతోందని తెలిపింది.

## 9న మోడీ ప్రమాణం

- తొలుత 8న అంటూ జోరుగా ప్రచారం
- తాజాగా మారిన తేదీ
- ముఖ్య అతిథులుగా విదేశీ ప్రతినిధులు



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:** నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానిగా జూన్ 9న ప్రమాణ స్వీకారం చేస్తారని తెలుస్తున్నది. తొలుత జూన్ 8న శనివారం మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని మీడియాలో వార్తలు వచ్చాయి. అయితే ఆదివారం సాయంత్రం 6 గంటలకు మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమం మారినట్లు సమాచారం. దేశంలో నెహ్రూ తర్వాత వరుసగా మూడోసారి ప్రధాని పదవిని మోదీ చేపట్టనున్నారు. కాగా, మోదీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి విదేశీ నేతలను కూడా ఆహ్వానించారు. దక్షిణాసియా అగ్రనేతలకు ఆహ్వానం అందిస్తున్నట్లు తెలుస్తున్నది. బంగ్లాదేశ్, శ్రీలంక, భూటాన్, నేపాల్, మారిషస్ దేశాధినేతలకు ఇప్పటికే ఆహ్వానాలు వెళ్లినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే, బంగ్లాదేశ్ ప్రధాన మంత్రి షేక్ హసీనా ఇప్పటికే మోదీ ఆహ్వానాన్ని అంగీకరించినట్లు సమాచారం. ఢిల్లీలోని కర్తవ్యపథ్లో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలుస్తోంది. తొలుత జూన్ 8న మోదీ ప్రమాణ స్వీకార ఉంటుందని వార్తలు వెలువడగా.. తాజాగా ఆ కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రానికి మార్చినట్లు సమాచారం. ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. దేశంలో నెహ్రూ తర్వాత వరుసగా మూడోసారి ప్రధాని పదవిని చేపట్టిన వ్యక్తి మోదీనే కావడం విశేషం. మోదీ ప్రమాణ స్వీకారానికి దక్షణాసియా దేశాలకు చెందిన అగ్ర నేతలు తరలిరానున్నారు. ఇప్పటికే బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే హాజరు అయ్యే విషయం ఖరారైంది. ఈ మేరకు ప్రమాణ స్వీకారానికి హాజరుకావాల్సిందిగా రణిల్ విక్రమసింఘేను ప్రధాని

...మిగతా 2 లో

## కౌంటింగ్‌లో... అవకతవకలు

2




- ఏకపక్షంగా పోలింగ్
- వెయ్యి ఓట్లు గోల్ మాల్
- కౌంటింగ్ ఏజెంట్ల సంతకాల లేకుండానే లీడ్ ప్రకటన
- బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్ రెడ్డి



### పవన్‌కు మెగా ఫ్యామిలీ...
## అపూర్వ స్వాగతం

2

- తల్లి అంజనాదేవి వారికి గుమ్మడి కాయతో దిష్టి
- చిరంజీవి కాళ్లకు నమస్కారం చేసిన పవన్
- కల్యాణ్ బాబు హ్యాట్సాఫ్'






## 12న చంద్రబాబు.. ప్రమాణ స్వీకారం

- 11న టీడీఎల్పీ సమావేశం
- ప్రధాని సహా వివిధ పార్టీలను ఆహ్వానం

2





## తెలంగాణకు ప్రత్యామ్నాయం బీజేపీయే

- 35 శాతం ఓటు బ్యాంకు ఇచ్చారు
- మా ఓట్ షేర్ రెండున్నర శాతం పెరిగింది
- బీఆర్ఎస్ తమ ఉనికిని కూడా కోల్పోయింది
- 14 చోట్లు మూడో స్థానం
- 8 చోట్ల డిపాజిట్ కూడా దక్కలే..
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

3

### ప్రతిపక్షనేతగా...
## రాహుల్

- మెజార్టీ కార్యకర్తల అభిప్రాయమిదే..
- ఎన్నికల ప్రచారాన్ని రాహుల్ ముందుకు నడిపించారు
- కాంగ్రెస్ పార్టీని కాపాడిన అగ్రనేత

2



## లీడ్‌లో తీన్మార్ మల్లన్న

### కొనసాగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్





**విశాలభారతి,స్టేట్ బ్యూరో :** వరంగల్ - ఖమ్మం - నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు గురువారం సాయంత్రం కొనసాగుతోంది. గురువారం సాయంత్రం మూడో రౌండ్ ఫలితాలను అధికారులు వెల్లడించారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియలో మూడో రౌండ్ పూర్తయ్యేసరికి

... వివరాలు 2 లో

## రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగాలి

- చంద్రబాబుకు సీఎం రేవంత్‌రెడ్డి ఫోన్
- బాబు ప్రమాణ స్వీకారానికి ఆహ్వానిస్తే వెళ్తా : సీఎం రేవంత్




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో ఘన విజయం సాధించి మరోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టబోతున్న చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంపై మంత్రి సీతక్క, ఎంపీ బలరాంనాయక్ తదితరులతో కలిసి సమీక్ష జరుగుతుండగా ఏపీలో టీడీపీ విజయం ప్రస్తావన రాగానే చంద్రబాబు నాయుడుకు రేవంత్ రెడ్డి ఫోన్ చేసి మాట్లాడారు. చంద్రబాబు నాయుడుకి అభినందనలు తెలిపిన రేవంత్ రెడ్డి, రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగాలని

వివరాలు2లో

## ప్రతిపక్షనేతగా రాహుల్

**విశాలభారతి,నేషనల్ బ్యూరో :** తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి బలం పుంజుకుంది. అంతేకాదు కొన్ని ప్రాంతాల్లో బీజేపీకి సైతం గట్టి పోటీ ఇచ్చింది. ఇక ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 99 స్థానాలకు గెలుచుకుంది. దీంతో లోక్‌సభలో ఆ పార్టీ ప్రతిపక్ష హోదా లభించినట్లు అయింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆ పదవి చేపట్టాలంటూ ఆ పార్టీలోని నేతలు ఎక్స్ వేదికగా అభిప్రాయపడుతున్నారు. ఆ క్రమంలో వారి అభిప్రాయాలు.. కాంగ్రెస్ సీనియర్ నేత కార్తీ చిదంబరం స్పందించారు. 'కాంగ్రెస్ పార్టీకే ఆ స్లాట్ వస్తుందని భావిస్తున్నానన్నారు. తన వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేతగా బాధ్యతలు చేపట్టాలని ఆయన తన అభిప్రాయాన్ని తెలియజేశారు. ఇక కాంగ్రెస్ పార్టీ ఎంపీ మాణిక్కం ఠాగూర్ స్పందిస్తూ.. లోక్‌సభలో రాహుల్ గాంధీ తమ నాయకుడిగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ ఎన్నికల్లో ప్రజల మధ్యకు వెళ్లి రాహుల్ గాంధీ పేరు చెప్పి ఓట్లు అడిగానన్నారు. తమ పార్టీ నుంచి ఎన్నికైన సభ్యులంతా ఇదే విధంగా కోరుకుంటారన్నారు. అయితే తమది ప్రజాస్వామిక పార్టీ అని ఆయన ఈ సందర్భంగా అభివర్ణించారు. ఇక కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు వివేక్ తంఖా సైతం స్పందించారు. ఈ ఎన్నికల ప్రచారాన్ని రాహుల్ ముందుండి నడించారన్నారు. ఆ క్రమంలో ఆయన సభలో పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాలని ఆకాంక్షించారు. పార్టీ ఎంపీలు ఆ దిశగా ఆడుగులు వేసి.. ఆయన్ని నాయకులుగా ఎన్నుకోవాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. లోక్‌సభలో రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేతగా ఉంటే తాము సైతం స్వాగతిస్తామని మహారాష్ట్ర ఎంపీ సంజయ్ రౌత్ స్పష్టం చేశారు. ఇక అమేఠీ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నిలిచి గెలిచిన కేఎల్ శర్మ సైతం లోక్‌సభలో ప్రతిపక్షనేతగా రాహుల్ గాంధీ బాధ్యతలు చేపట్టాలని ఆకాంక్షించారు. అలాగే ప్రియాంక గాంధీ సైతం ఎన్నికల్లో పోటీ చేసి.. పార్లమెంట్లోకి రావాలని ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు.

## లీడ్‌లో తీన్మార్ మల్లన్న

మొదటిపేజీ తరువాయి :

కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న 18,878 ఓట్ల ఆధిక్యంలో కొనసాగుతున్నారు. నాల్గో రౌండ్ ఓట్ల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 1,06,234 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్ రెడ్డికి 87,356 ఓట్లు, బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డికి 34,516 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కు 27,493 నమోదయ్యాయి. మూడు రౌండ్ల ఫలితాలు వెల్లడికాగా తీన్మార్ మల్లన్న 18,878 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు.

### అభ్యర్థులకు వచ్చిన ఓట్లు

**తీన్మార్ మల్లన్న (కాంగ్రెస్) : 1,06,234**
**రాకేష్ రెడ్డి (బీఆర్ఎస్): 87,356**
**ప్రేమెందర్ రెడ్డి (బీజేపీ) : 34,516**
**అశోక్ (స్వతంత్ర అభ్యర్థి) : 27,493**

ప్రధానంగా తీన్మార్ మల్లన్న, రాకేష్ రెడ్డిల మధ్యే పోటీ నెలకొంది. మొత్తం మూడు రౌండ్లు ముగిసే సమయానికి 2,64,216 వలిడ్ ఓట్స్ నమోదయ్యాయి. నాలుగో రౌండ్ ఓట్ల లెక్కింపును అధికారులు ప్రారంభించారు. ఇప్పటి వరకు మొత్తం 2,88,000 ఓట్లను లెక్కించారు. ఇంకా 48,013 ఓట్లను లెక్కించాల్సి ఉంది. ఓట్ల లెక్కింపులో భారీగా చెల్లని ఓట్లు బయటపడుతున్నాయి. మూడు రౌండ్లు ముగిసే సరికి చెల్లని ఓట్లు 23,784గా నమోదయ్యాయి. విద్యావంతులే ఇలాంటి పొరపాట్లు చేయడం ఏంటని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నల్గొండలోని దుప్పలపల్లి గిడ్డంగుల సంస్థ గోదాముల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్ జరుగుతోంది. పట్టభద్రుల ఉపఎన్నికలో మొత్తం 3.36 లక్షల ఓట్లు పోలయ్యాయి. తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు నాలుగు రౌండ్లలో పూర్తి అవుతుంది. చెల్లిన ఓట్లలో 50 శాతానికిపైన ఒక ఓటు వచ్చిన అభ్యర్థి విజేతగా ప్రకటిస్తారు. తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో ఫలితం తేలకపోతే రెండో ప్రాధాన్యతా ఓట్లను లెక్కిస్తారు. ఇప్పటి వరకు ఓట్ల లెక్కింపు సజావుగా జరిగిందని ఆర్వో దాసరి హరిచందన తెలిపారు. మొదటి ప్రాధాన్యత ఓటులో ఫలితం తేలకపోతే పూర్తి ఫలితం రావడానికి శుక్రవారం సాయంత్రం పట్టొచ్చు.

## 12 న చంద్రబాబు ప్రమాణ స్వీకారం

**విశాలభారతి,ఆంధ్రప్రదేశ్:** ఏపీలో ఈ నెల 11న టీడీఎల్పీ సమావేశం నిర్వహించి ముఖ్యమంత్రిగా చంద్రబాబుని ఎన్నుకుని గవర్నర్ కు నివేదిక పంపుతామని తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం 12న ఉంటుందని తెలిపారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ప్రధాని మోదీ సహా వివిధ పార్టీల నేతల్ని ఆహ్వానిస్తున్నామన్నారు. ప్రధాని ప్రమాణ స్వీకారంతో పాటు ఒడిశా ప్రభుత్వ ఏర్పాటు ప్రమాణ స్వీకారానికి కూడా చంద్రబాబు వెళ్తారని తెలిపారు. దొంగే దొంగా దొంగా అని ఏద్చే విధానాలు ఓటమి చూశాక కూడా జగన్ మారలేదని విమర్శించారు. అసహనంతో తెలుగుదేశం శ్రేణులపై దాడుల్ని ప్రేరేపిస్తూ తామేదో దాడులు చేస్తున్నట్లు అసత్య ప్రచారాలు చేస్తున్నాడని గోరంట్ల బుచ్చయ్యచౌదరి మండిపడ్డారు. జూన్ 9న ప్రధాని ప్రమాణస్వీకార కార్యక్రమం ఉన్న నేపథ్యంలో ఆ కార్యక్రమానికి హాజరైన అనంతరం ఏపీలో 12వ తేదీన చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఎన్డీఏ మిత్రపక్షాలు సైతం ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉన్నందున తెలుగుదేశం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. బీజేపీ పార్లమెంటరీ భేటీ తర్వాత, మరోసారి ఎన్డీఏ నేతల సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ సమావేశానికి ఎన్డీఏ భేటీకి కూటమిలోని ఎంపీలంతా హాజరుకావాలని నిర్ణయించారు. ఎల్లుండి రాష్ట్రపతి ముర్మును కలిసి ఎన్డీఏ ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరనున్నారు. అందులో భాగంగా ఈ నెల 9న ప్రధాని ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుందని బీజేపీ వర్గాలు వెల్లడించాయి.

## పవన్‌కు మెగా ఫ్యామిలీ అపూర్వ స్వాగతం

**విశాలభారతి,స్టేట్ బ్యూరో :** జనసేన అధినేత పవన్ కల్యాణ్ అగ్ర కథానాయకుడు, తన సోదరుడైన చిరంజీవిని కలిశారు. ఢిల్లీలో ఎన్డీయే కూటమి సమావేశాన్ని ముగించుకుని హైదరాబాద్ వచ్చిన పవన్, భార్య అన్నాలెజినోవా, కుమారుడు అకీరాలతో కలిసి నేరుగా చిరు నివాసానికి వెళ్లారు. తల్లి అంజనా దేవి వారికి గుమ్మడి కాయతో దిష్టి తీయగా, పవన్ వదినలు నీరాజనాలు ఇస్తూ లోపలికి ఆహ్వానించారు. మరోవైపు ఈ విజయోత్సవంలో భాగం అయ్యేందుకు మెగా కుటుంబ సభ్యులందరూ చిరు ఇంటికి చేరుకున్నారు. అన్నయ్య చిరంజీవి రాగానే నేరుగా ఆయన కాళ్లకు నమస్కారం చేయగా, పవన్ను పైకి లేపి ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఆపై చిరు పైకి ఎగిరి మరీ పవన్కు భారీ పూలదండను వేయగా మెగా ఫ్యామిలీలో సంతోషాలు వెల్లివిరిశాయి. ఈ సందర్భంగా 'కల్యాణ్ బాబు హ్యాట్సాఫ్' అని రాసి ఉన్న కేక్‌ను కట్ చేసి ప˘వన్ తన కుటుంబసభ్యులకు తినిపించారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా జనసేన పోటీ చేసిన 21 స్థానాలనూ కైవసం చేసుకుంది. ఈ క్రమంలో ఢిల్లీలో ఎన్డీయే కూటమి సమావేశాన్ని ముగించుకుని పవన్ నేడు హైదరాబాద్ చేరుకున్నారు. నేరుగా మెగాస్టార్ ఇంటికి వెళ్లి, కుటుంబ సభ్యుల ఆశీర్వాదం తీసుకున్నారు.



### నా హృదయం ఉప్పొంగుతోంది

ఏపీ ఎన్నికల్లో పవన్ విజయం సాధించడంపై సోషల్ మీడియా వేదికగా చిరంజీవి మంగళవారం ఆనందం వ్యక్తం చేశారు. పవన్తో పాటు టీడీపీ అధినేత చంద్రబాబుకు చిరు శుభాకాంక్షలు తెలిపారు. "డియర్ కల్యాణ్ బాబు, ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసిన నిన్ను తగ్గావని ఎవరు అనుకున్నా, అది ప్రజలను గెలిపించడానికే అని నిరూపించావ్. నిన్ను చూస్తుంటే ఓ అన్నగా గర్వంగా ఉంది. నువ్వు గేమ్ ఛేంజర్ మాత్రమే కాదు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ కూడా అని అందరూ నిన్ను కొనియాడుతుంటే నా హృదయం ఉప్పొంగుతోంది. ఈ అద్భుతమైన ప్రజా తీర్పు రాష్ట్ర భవిష్యత్ కోసం, ప్రజల సంక్షేమం కోసం, నీ కలల్ని, నువ్వు ఏర్పరుచుకున్న లక్ష్యాల్ని నిజం చేసే దిశలో నిన్ను నడిపిస్తుందని ఆకాంక్షిస్తూ, ఆశీర్వదిస్తూ శుభాభినందనలు" అని పోస్టు పెట్టారు.

## కంగనాపై దాడి



- చేయి చేసుకున్న భద్రతా సిబ్బంది
- విధుల నుంచి తొలగింపు
- రైతు ఉద్యమాన్ని అవమానించిందన్న సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్

**విశాలభారతి,నేషనల్ బ్యూరో :** నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌పై గురువారం దాడి జరిగింది. ఛండీగఢ్ ఎయిర్‌పోర్టులో భద్రతా సిబ్బంది ఒకరు ఆమెపై చెయ్యి చేసుకున్నట్లు తెలుస్తోంది. రైతుల్ని, రైతు ఉద్యమాన్ని ఖలిస్తాన్ వాదులని అవమానించేలా కంగనా మాట్లాడిందంటూ సదరు సిబ్బంది దాడి చేసినట్లు సమాచారం. కంగనాపై చెయ్యి చేసుకున్న సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌ను కుల్విందర్ కౌర్‌గా గుర్తించారు. గురువారం మధ్యాహ్నం ఢిల్లీకి బయల్దేరిన కంగన.. విమానం ఎక్కేందుకు చండీగఢ్ విమానాశ్రయంలో బోర్డింగ్ పాయింట్‌కు వెళ్తుండగా ఈ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ఢిల్లీలో ల్యాండ్ అయిన వెంటనే సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్, ఇతర సీనియర్ అధికారుల్ని కలిసి కంగన ఈ ఘటన గురించి ఫిర్యాదు చేశారు. దీంతో దీనిపై దర్యాప్తు చేసేందుకు బృందాన్ని ఏర్పాటు చేసిన అధికారులు.. కుల్వీందర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆమెను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ విచారణ నిమిత్తం సీఐఎస్ఎఫ్ కమాండెంట్ కార్యాలయానికి తరలించారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో హిమాచల్ ప్రదేశ్ మండి స్థానం నుంచి కంగనా గెలుపొందిన సంగతి తెలిసిందే. తాజా దాడి ఘటనపై బీజేపీ నేతలు, సానుభూతి పరులు సోషల్ మీడియా వేదికగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని టి ఎల్ ఎఫ్ వినతిపత్రం..

**సికింద్రాబాద్ విశాల భారతి :** తెలంగాణ లెక్చరర్స్ ఫోరం(%యూఖీ% )అధ్యక్ష, కార్యదర్శులు పి. మురళి మనోహర్, డా. యూ. సిద్దేశ్వర్, సమన్వయ కర్త పి. నాగయ్య, డా. యాదయ్య ల ఆధ్వర్యంలో గురువారం బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కార్యదర్శి శృతి ఓజా ని నాంపల్లి లోని వారి కార్యాలయంలో కలసి వినతి పత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రైవేటు జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలతో పాటు, గత మార్చిలో మూల్యాంకనం చేసిన అధ్యాపకులకు చాలామందికి వివిధ జిల్లాలలో మూల్యాంకన రెమ్యూనరేషన్ రాకపోవడం, కొంతమందికి 20% డబ్బులను ఇవ్వకపోవడం, మూల్యాంకన సమయంలో సీనియర్ అధ్యాపకులను ప్రైవేట్ కళాశాలలో పని చేస్తున్నారనే నేపంతో %జూ% గా అవకాశం కల్పించకపోవడం,కొన్ని మూల్యాంకన కేంద్రాలలో కొంతమంది అధికారులు అధ్యాపకులచే 30 పేపర్లకు బదులు అంతకంటే ఎక్కువ పేపర్లు దిద్దించడంతో పొరపాట్లకు కారణమవుతు అధ్యాపకులను బలి చేస్తున్నారని, అలాంటి అధికారులపై చర్యలు తీసుకొవలన్నారు. అధ్యాపకులకు న్యాయం చేయాలని, పాఠాలు బోధించని అధ్యాపకులను మూల్యాంకనానికి పంపిస్తున్న కార్పోరేట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, సీనియారిటీ ప్రకారం అన్ని బాధ్యతలలో ప్రైవేటు అధ్యాపకులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన కార్యదర్శి తక్షణం గతంలో జరిగిన మూల్యాంకన రెమ్యూనరేషన్ వారి అకౌంట్లో వేయాలని అధికారులను ఆదేశించారు. మిగిలిన వారు ఎవరైనా అధ్యాపకులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని %యూఖీ% నాయకులకు సూచించారు. ఈ సందర్భంగా టిఎల్ఎఫ్ నాయకులు కార్యదర్శి కి ధన్యవాదాలు తెలియజేస్తూ భవిష్యత్తులో ఇలాంటి లోపాలు లేకుండా చూడాలని లేనిపక్షంలో టిఎల్ఎఫ్ తరఫున ఉద్యమిస్తామని తెలియజేశారు.




## 9న మోడీ ప్రమాణం

మొదటిపేజీ తరువాయి :

మోదీ ఆహ్వానించారని ఆ దేశ అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. ఇదిలా ఉండగా.. ఇటీవల ప్రకటించిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 240 స్థానాలను గెలుచుకుంది. 2014లో 282 సీట్లు, 2019లో 303 చోట్ల విజయ కేతనం ఎగరవేసి సొంతంగా మేజార్టీ స్థానాలు దక్కించుకున్న బీజేపీ.. ఈసారి ఈసారి మెజార్టీ (272) కంటే తక్కువ స్థానాలకే పరిమితమైంది. కేవలం 240 సీట్లను గెలుచుకున్న బీజేపీ.. ఎన్డీయే కూటమి మిత్రపక్షాల సాయంతో ముచ్చటగా మూడోసారి అధికారాన్ని ఏర్పాటు చేయనుంది. కూటమి నేతల మద్దతుతో ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు.

## రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగాలి

మొదటిపేజీ తరువాయి :

ఆకాంక్షించారు. విభజన చట్టానికి సంబంధించిన పెండింగ్ అంశాలను సహృద్భావ వాతావరణంలో పరిష్కరించుకునేందుకు సహకరించాలని చంద్రబాబు నాయుడును సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఆహ్వానిస్తే వెళ్తా.. ఏపీలో తెలుగుదేశం విజయంపై స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి నిన్న మీడియా సమావేశంలో కూడా స్పందించారు. టీడీపీ అధినేత చంద్రబాబు సీఎం ప్రమాణస్వీకారానికి ఆహ్వానిస్తే తమ పార్టీ నేతలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఏపీలో ఘనవిజయం సాధించిన మహా కూటమికి ఆయన అభినందనలు తెలిపారు.

## కౌంటింగ్‌లో అవకతవకలు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో :** ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపులో అవకతవకలు చోటు చేసుకున్నాయని బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి ఆరోపించారు. ఓట్ల లెక్కింపు ఏకపక్షంగా జరుగుతోందని విమర్శించారు. కౌంటింగ్ ఏజెంట్ల సంతకాలు లేకుండానే లీడ్ ప్రకటించారన్నారు. సందేహాలను నివృత్తి చేయకుండా ఆర్వోలు ఏకపక్షంగా వ్యవహరించారని, అధికారులు ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించలేదని చెప్పారు. ఇదేంటని అడిగితే పోలీసులు బయటకు నెట్టారన్నారు. సుమారు వెయ్యి ఓట్లు గోల్‌మాల్ అయ్యాయని ఆక్షేపించారు.
ఈ ఆరోపణలను కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఖండించారు. అధికారుల పనితీరుపై భారాస నేతలు అసత్యాలు ప్రచారం చేయడం సరికాదన్నారు. ఓట్ల లెక్కింపు ఫలితాలు ఆ పార్టీ నేతలకే ముందుగా తెలుస్తున్నాయని చెప్పారు. రూ.కోట్లు ఖర్చు పెట్టి గెలవాలని కేటీఆర్ ప్రయత్నించారని ఆరోపించారు. గతంలో మాదిరి గోల్‌మాల్ చేసి గెలవాలనుకుంటున్నారని విమర్శించారు. ఓటమి భయంతోనే ప్రస్తుతం అధికారులపై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఈ పరిస్థితిని చూస్తే.. ఓటమిని ముందుగానే అంగీకరించినట్లు తెలుస్తోందన్నారు. నల్గొండలో ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు రెండో రోజు కూడా కొనసాగుతోంది. తొలి 3 రౌండ్లలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న 18,878 ఓట్ల ఆధిక్యత కనబరిచారు. ఆయనకు 1,06,234 ఓట్లు, భారాస అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి 87,356 ఓట్లు, భాజపా అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి 34,516 ఓట్లు పోలయ్యాయి. ఇండిపెండెంట్ అభ్యర్థికి అశోక్‌కుమార్‌కు 27,493 ఓట్లు వచ్చాయి. తాజాగా నాలుగో రౌండ్ లెక్కింపు మొదలైంది.

## ప్రజావాణి కార్యక్రమం నేటి నుంచి పునఃప్రారంభం

**విశాలభారతి,స్టేట్ బ్యూరో :** నేటి నుంచి ప్రజా వాణి కార్యక్రమం మళ్లీ ప్రారంభం కానుంది. మహాత్మ జ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌లో ప్రతీ మంగళ, శుక్రవారాల్లో కొనసాగుతుందని ప్రజావాణి ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రజాభవన్లో ప్రజావాణి నిర్వహిస్తున్నారు. అయితే లోక్ సభ ఎన్నికల కోడ్ వల్ల మార్చి 16 నుంచి ప్రజావాణిని నిలిపివేశారు. ఎన్నికల కోడ్ ముగిసినందున రేపటి నుంచి మళ్లీ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు తెలిపా రు. ప్రజలు ప్రజావాణి అవకాశాన్ని సద్వినియో గం చేసుకోవాలని కోరారు. ప్రజావాణి రాష్ట్ర నోడల్ ఆఫీసర్గా ఐఏఎస్ అధికారి దివ్య కొనసాగుతున్నారు.



# ప్రజాతీర్పుతో ఆకాశంలో ఎగరొద్దు



- సేవచేస్తేనే మళ్లీ ఆదరిస్తారు
- రాష్ట్ర ప్రయోజనాలే మనందరి ప్రథమ కర్తవ్యం
- నమ్మకంతో ఇచ్చిన విజయాన్ని బాధ్యతగా పనిచేద్దాం
- టీడీపీ అధినేత చంద్రబాబు

**విశాలభారతి,ఆంధ్రప్రదేశ్ :** ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ తొలి సమావేశం జరిగింది. అందుబాటులో ఉన్న ఎంపీలు స్వయంగా హాజరుకాగా ఢిల్లీ, ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు జూమ్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఎవరూ ఆకాశంలో ఎగరొద్దని ఎంపీలకు చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజలు నమ్మకంతో ఇచ్చిన విజయాన్ని బాధ్యతగా సమాజ సేవ చేసేందుకు వినియోగించాలని సూచించారు.రాష్ట్ర ప్రయోజనాలు పట్టించుకోని వైసీపీ ఎంపీలు జగన్ కేసుల మాఫీ అజెండాతోనే ఢిల్లీలో పైరవీలు చేశారని ఆయన దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రయోజనాలే మనందరి ప్రథమ కర్తవ్యం కావాలన్న చంద్రబాబు అందుకు తగ్గట్టుగానే పార్లమెంట్లో కృషి చేయాలన్నారు. ముందు ప్రజాస్వామ్య వ్యవస్థల్ని గౌరవించాలి, ఆ తర్వాతే మనమని చంద్రబాబు తెలిపారు. వ్యవస్థలకు అతీతంగా ఎవరు వ్యవహరించినా, ఆ వ్యవస్థే తిరిగి కాటేస్తుందని గుర్తించాలన్నారు. పదవులు శాశ్వతం అని ఎవ్వరూ అనుకోవద్దని అన్నారు. మన ప్రమాణ స్వీకారానికి మోదీని ఆహ్వానించాం, ఆయన వచ్చేందుకు సానుకూలంగా స్పందించారని చంద్రబాబు తెలిపారు. కార్యకర్తలను గౌరవించేలా నాయకులు పనిచేయాలని సూచించారు. 5 ఏళ్ల పాటు అనేక సవాళ్లు, సమస్యలు ఎదుర్కొని పార్టీని కార్యకర్తలే నిలబెట్టారని అన్నారు. నాయకులు కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎంపీలుగా మంచి పనితీరు కనబరిచి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆసక్తికర ఘటన జరిగింది. ఒక సామాన్యమైన కార్యకర్తకు, చిన్న నాయకులకు కూడా పార్టీలో పదవులు, అవకాశాలు కల్పించే విధంగా తన నిర్ణయాలు ఉంటున్నాయని చంద్రబాబు స్పష్టం చేశారు. నాయకులుగా ఉన్న మీరు, ఇతర నాయకులతో కూడా అలాగే ఉండాలని దిశానిర్దేశం చేశారు. కష్టపడి, విధేయతతో ఉంటే పదవులు వస్తాయని దానికి విజయనగరం ఎంపీగా గెలిచిన కలిశెట్టి అప్పలనాయుడే ఉదాహరణ అని అన్నారు.

అప్పలనాయుడుకు ఎంపీ టిక్కెట్ ఇస్తే చాలా మంది చాలా వ్యాఖ్యలు చేశారని అయితే కష్టపడి పనిచేసి అందరినీ కలుపుకుని పోయి కలిశెట్టి గెలిచాడని అభినందించారు. అప్పల నాయుడు ఆర్థికంగా బలవంతుడు కాకపోయినా పార్టీలో ఉన్న సామాన్యులకు టిక్కెట్లు వస్తాయి అనడానికి ఇదొక ఉదాహరణ అని చంద్రబాబు వివరించారు. ఎంపీలందరూ నేటి రాత్రికి, లేదా రేపు ఉదయానికి ఢిల్లీ చేరుకోవాలని సూచించారు. అప్పల నాయుడూ ఫ్లైట్ టిక్కెట్ ఉందా తీసుకున్నావా అంటూ అప్యాయంగా అడిగారు. లేదంటే చెప్పు మన వాళ్లు టిక్కెట్ బుక్ చేస్తారని చంద్రబాబు ఆరా తీయడంతో కలిశెట్టి భావోద్వేగానికి గురయ్యారు.

# 100 సీట్లుతో కాంగ్రెస్ ఐసీయూ నుంచి జనరల్ వార్డుకు

- మారకపోతే జనరల్ వార్డ్ టు మార్చురీకి
- మోడీ ఏ బాధ్యతలు అప్పగించినా నిర్వహిస్తా
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందం
- కేసీఆర్ పార్టీని విలీనం చేసే సమయం కోసం ఎదురుచూస్తున్నారు
- ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవితది కీలక పాత్ర
- రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో :** తనకు పదవులు కావాలని ఎపుడూ కోరలేదని, ప్రధాని మోడీ ఎలాంటి బాధ్యతలు అప్పగించినా సమర్థవంతంగా నిర్వహిస్తానని రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ అన్నారు. ఢిల్లీలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్ ను ప్రజలు రాజకీయంగా బొందపెట్టారన్నారు. ఆ పార్టీ ఉనికి కోల్పోయిందని, ఇక కాంగ్రెస్ లో విలీనమే మిగిలుందని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు వ్యతిరేకంగా ప్రజలు ఓటు వేస్తే కాంగ్రెస్ లాభపడిందన్నారు. కానీ ఆ అధికారం ఆరునెలల్లోనే మసకబారిందని పేర్కొన్నారు. తాజా ఎన్నికల్లో కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందం కుదరిందని, ఫోన్ ట్యాపింగ్, ధరణి, కాళేశ్వరం, ఇతర తప్పులను చూపి సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్ తో బేరసారాలు చేసుకున్నారన్నారు. కేవలం పాత్రధారులను అరెస్ట్ చేస్తోన్న ప్రభుత్వం సూత్రధారులను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని లక్ష్మణ్ ప్రశ్నించారు. కేసీఆర్ మొత్తం పార్టీని విలీనం చేసే సమయం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవితది కీలక పాత్ర అని, అందుకే నెలలు గడుస్తున్నా ఆమెకు బెయిల్ రావడం లేదన్నారు. సోనియా తెలంగాణ తల్లి కాదని, బలి దేవత అని, ఆ బలిదేవతకు రేవంత్ ఎలా భక్తుడయ్యాడో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో దాదాపు 100 సీట్లు గెలిచి కాంగ్రెస్ ఐసీయూ నుంచి జనరల్ వార్డుకు వచ్చిందని లక్ష్మణ్ ఎద్దేవాచేశారు. ఇప్పటికైనా మారకపోతే జనరల్ వార్డ్ టు మార్చురీకి పోవడం ఖాయమన్నారు. కేవలం చాయ్ బిస్కెట్ల కోసం ఇండియా కూటమి నేతలు మీటింగ్ పెట్టుకున్నారన్నారని చురకలంటించారు



# ఎగ్జిట్ పోల్స్ పేరుతో భారీ స్కామ్

- మోదీ, షాపై దర్యాప్తు చేయాలి
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ




**విశాలభారతి,నేషనల్ బ్యూరో :** ఓటమిని జీర్ణించుకోలేకే బీజేపీ స్టాక్ మార్కెట్ గురించి రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై భారతీయ జనతా పార్టీ ఖండించింది. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేకే రాహుల్ గాంధీ ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్నారంటూ ఆ పార్టీ సీనియర్ నేత పీయూష్ గోయల్ ఆరోపించారు. భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలపాలని ఓ వైపు మోదీ చూస్తుంటే, మరోవైపు ఇన్వెస్టర్లను రాహుల్ గాంధీ తప్పుదోవ పట్టిస్తున్నారన్నారని దుయ్యబట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్షాతోపాటు దేశంలో ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన వారిపై దర్యాప్తు చేపట్టాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. బీజేపీకి చెందిన ఉన్నత స్థాయి వ్యక్తులు స్టాక్ మార్కెట్ స్కామ్కు పాల్పడ్డారని ఆరోపణలు చేశారు. రిటైల్ ఇన్వెస్టర్లు రూ.30 లక్షల కోట్లు కోల్పోయిన అతిపెద్ద స్టాక్ మార్కెట్ స్కామ్‌లో మోదీ, అమిత్ షా ప్రమేయం ఉందని ఆరోపించారు. అసలు మోదీ, అమిత్ షా పెట్టుబడి సలహా ఎందుకు ఇచ్చారని ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్మీట్లో రాహుల్ ప్రశ్నించారు. ఎన్నికల వేళ ప్రధాని, హోంమంత్రి, ఆర్థిక మంత్రి స్టాక్ మార్కెట్పై వ్యాఖ్యానించడాన్ని తొలిసారి చూసినట్లు తెలిపారు. ఎగ్జిట్ పోల్స్ తప్పు అని బీజేపీ నేతలకు ముందే తెలుసని రాహుల్ ఆరోపించారు. ఫేక్ ఎగ్జిట్ పోల్స్ తర్వాత స్టాక్ మార్కెట్లు దూసుకెళ్లాయని, ఆ తర్వాత జూన్ 4వ తేదీన కుప్పకూలాయని అన్నారు. అతిపెద్ద స్టాక్ మార్కెట్ కుంభకోణంపై జేపీసీ విచారణ కోరుతున్నట్లు తెలిపారు.


# తెలంగాణకు... ప్రత్యామ్నాయం బీజేపీయే



**విశాలభారతి,బ్యూరో :** రాష్ట్రంలో బీజేపీ సరైన రాజకీయ ప్రత్యామ్నాయ ంగా ఎదుగుతోందని, ప్రజల ఓటింగే ఇందుకు నిదర్శనమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ గణనీయమైన సీట్లు పొందిందని, గతంలో కంటే ఎక్కువ సీట్లు, ఓట్ల శాతం సంపాదించుకున్నామని ఆయన అన్నారు. సంయుక్త ఆంధ్రప్రదేశ్ లో, గత పదేండ్లలో తెలంగాణలోనూ స్వతంత్రంగా పోటీచేసి ఇన్ని సీట్లు ఏనాడూ పొందలేదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 8 ఎమ్మెల్యే స్థానాలు గెలిచామని, ఈ పార్లమెంట్ ఎన్నికల్లోనూ 8 ఎంపీ స్థానాలు గెలిచినట్లు చెప్పారు. ఈ ఎన్నికల్లో 35 శాతం ఓట్లతో 8 పార్లమెంటు సీట్లను బీజేపీ గెలిచిందని ఆయన వివరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు 39 శాతం ఓట్లు రాగా ఇప్పుడు 40 శాతం ఓట్లు వచ్చాయన్నారు. 6 నెలల తమ పాలకు రెఫరెండంగా ప్రకటించుకున్న కాంగ్రెస్ కు కేవలం ఒక శాతం ఓటును మాత్రమే అదనంగా పొందారని, అదే సమయంలో తమ ఓటు శాతం రెండున్నర రెట్లు పెరిగిందని కిషన్ రెడ్డి కొనియాడారు. ఐదేండ్లల్లో బీజేపీకి 40 లక్షల ఓట్లు పెరిగాయని కిషన్ రెడ్డి వివరించారు. మరోవైపు బీఆర్ఎస్ తమ ఉనికిని కూడా కోల్పోయిందని పేర్కనొనారు. బీఆర్ఎస్ 14 చోట్ల 3వ స్థానానికే పరిమితమైందన్నారు. 8 చోట్ల డిపాజిట్లు కోల్పోయిందని అన్నారు. రేవంత్ రెడ్డి సామ, భేద, దాన, దండోపాయాలు ప్రయోగించినా, తమపై అసభ్య పదజాలం ప్రయోగించినా.. ప్రజలు బీజేపీకే పట్టం కట్టారని కొనియాడారు. రిజర్వేషన్లు రద్దు చేస్తామంటూ అమిత్ షా పై మార్ఫింగ్ వీడియోను చేశారని, కాంగ్రెస్ దిగజారడం వల్ల ప్రజలు బీజేపీవైపు నిలిచారన్నారు. ఈ పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటామని, మరింతగా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్తామని కిషన్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణలో బీఆర్ఎస్ బలహీనపడటం, ఆరు నెలల్లోనే కాంగ్రెస్ పై తీవ్రమైన వ్యతిరేకత రావడంతో తెలంగాణలో రాజకీయ శూన్యత నెలకొందన్నారు. ఇచ్చిన హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్ విఫలమైందని కిషన్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ మోసాలను ఎండగడతామని పేర్కొన్నారు. రామమందిరం రాజకీయ పరమైన అంశం కాదని ఆయన వ్యాఖ్యానించారు.

# దోస్త్ ఫస్ట్ ఫేజ్ సీట్ల కేటాయింపు

- 76,290 మంది విద్యార్థులకు అలాట్ మెంట్
- వచ్చే నెల 8 నుంచి తరగతులు




**విశాలభారతి,స్టేట్ బ్యూరో :** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం దోస్త్(డిగ్రీ ఆన్లైన్ సర్వీసెస్ తెలంగాణ) రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే ఉన్నత విద్యామండలి గురువారం మొదటి విడత సీట్లను కేటాయించింది. ఫేజ్-1లో భాగంగా మొత్తం 1,04,784 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా.. 76,290 మందికి సీట్లు కేటాయించారు. ఇందులో యువకులు 28,423 మంది, యువతులు 47,867 మంది ఉన్నారు. ఆర్ట్స్ గ్రూపుల్లో 7,766, కామర్స్ గ్రూపుల్లో 28,655, లైఫ్ సైన్సెస్ గ్రూపుల్లో 15301, ఫిజికల్ సైన్సెస్ గ్రూపుల్లో 14964, డేటాసైన్స్ గ్రూపుల్లో 2502, డీ ఫార్మసీ 90, ఇతర గ్రూపుల్లో 7012 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. ఈ ఏడాది నుంచి గతంలో ప్రవేశపెట్టిన స్కిల్ కోర్సులను పలు కాలేజీల్లో విస్తరించారని తెలిసింది. జూలై 8 నుంచి ఫస్టియర్ క్లాసులు ప్రారంభంకానున్నాయి. ఇదిలా ఉండగా రాష్ట్రవ్యాప్తంగా 1,066 డిగ్రీ కాలేజీలుండగా, వీటిల్లో 4,49,449 సీట్లున్నాయి. వీటిలో 135 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలుండగా, 86 రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలున్నాయి. గతేడాది 3,89,049 సీట్లుంటే 2.05లక్షల సీట్లు నిండాయి. ఇదిలా ఉండగా సీటు పొందిన విద్యార్థులు దోస్త్ వెబ్ సైట్ లో లాగిన్ అయి రూ.500 లేదా రూ.1000 చెల్లించి 7వ తేదీ నుంచి 12వ తేదీ లోపు సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి సీటును రిజర్వ్ చేసుకోవాలి. సెల్ఫ్ రిపోర్టింగ్ చేయకుంటే సీటు రద్దవుతుందని అధికారులు సూచించారు. ఫేజ్ 3 తర్వాతే సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 29 నుంచి జూలై 5 వరకు సంబంధిత కాలేజీలకు వెళ్లి రిపోర్టింగ్ చేయాలని సూచించారు.

# నేడు మేడిగడ్డకు మంత్రి ఉత్తమ్

- మరమ్మతుల పురోగతిపై సమీక్ష



**విశాలభారతి,స్టేట్ బ్యూరో :** మేడిగడ్డతో పాటు అన్నారం, సుందిళ్ల ఆనకట్ట మరమ్మతులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షించనున్నారు. ఎన్డీఎస్ఏ కమిటీ సిఫార్సుల మేరకు చేపడుతున్న చర్యల పురోగతిని తెలుసుకునేందుకు శుక్రవారం రోజున (జూన్ 6వ) క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. నీటిపారుదలశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్ కుమార్, ఇతర ఇంజినీర్లతో కలిసి పనులపై ఆరా తీయనున్నారు.మూడు ఆనకట్టల నిర్మాణ సంస్థలైన ఎల్ అండ్ టీ, ఆఫ్కాన్స్, నవయుగ సంస్థల ఉన్నతస్థాయి ప్రతినిధులు కూడా సమావేశానికి హాజరు కావాలని మంత్రి కార్యాలయం ఆదేశాలు చేసింది.. మేడిగడ్డ ఆనకట్టతో పాటు అన్నారం, సుందిళ్ల ఆనకట్టల వద్ద జరుగుతున్న తాత్కాలిక మరమ్మతులు, వర్షాకాలం కోసం రక్షణ చర్యలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇంజనీర్లు, నిర్మాణ సంస్థల ప్రతినిధులతో మంత్రి సమీక్షిస్తారు

## గట్టుపై కొలువుదీరిన తిరుమలేశునికి నైవేద్యం

▶▶ మొక్కు తీర్చుకున్న ఎమ్మెల్యే మేఘ రెడ్డి



**వనపర్తి విశాల భారతి:** జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న తిరుమలయ్య గట్టు పై కొలువుదీరిన తిరుమలేష్యున్ని ఎమ్మెల్యే మేఘారెడ్డి నైవేద్యంతో మొక్కు తీర్చుకున్నారు. గురువారం అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని గట్టుపై కొలువుదీరిన తిరుమలేశునికి, ఆంజనేయస్వామికి అభిషేకం చేసి కొబ్బరికాయ కొట్టారు. ప్రజలను సుభిక్షంగా చూడాలని ఆకాంక్షించారు. పెద్దగూడెం గ్రామస్తులు ప్రతి అమావాస్య కు తిరుమలాయ గట్టు వద్ద ఉన్న ఆంజనేయ స్వామి వారి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమలు, భజనలు ,కోలాటాలు, బొడ్డెమ్మలు, పలు కల్చరల్ ప్రోగ్రామ్స్, భక్తి భావన పెంపొందించడం కోసం కార్యక్రమం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. ఆపై విష్ణువర్ధన్ రెడ్డి , సునీత దంపతులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లక్కాకుల సతీష్, కాంగ్రెస్ వనపర్తి పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, కౌన్సిలర్ బాపన్ పల్లి వెంకటేష్, తిరుపతి రెడ్డి, మాజీ కౌన్సిలర్ కృష్ణ బాబు, రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## వేతన తిప్పలు తప్పవా?

▶▶ ఆసుపత్రి కార్మికులకు మూడు నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలి

▶▶ ఎమ్మెల్యే మేఘ రెడ్డికి వినతిపత్రం అందజేత



**వనపర్తి విశాల భారతి:** వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ సూపర్వైజర్ కార్మికులకు పెండింగ్ లో ఉన్న మూడు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)రాష్ట్ర కార్యదర్శి విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రి కార్మికులకు మూడు నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని, కార్మికులను వేధింపులకు గురి చేస్తున్న అంబియన్స్ ఏజెన్సీ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐటియుసి ప్రతినిధి బృందం గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు మేఘారెడ్డి రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పానుగంటి సురేష్ మాట్లాడుతూ.... ఏజెన్సీ పై విచారణ పేరుతో ఆస్పత్రి కార్మికుల వేతనాలు అందించడంలో తీవ్రమైన అలసత్వం ప్రదర్శిస్తున్నారని అన్నారు. సంబంధిత అంబియన్స్ ఏజెన్సీ నిర్వాహకులను అనేక పర్యాయాలు అడుగుతున్న దాటా వేసే సమాధానం చెబుతున్నారని అన్నారు. మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోతే కార్మికుల జీవనం సాగేది ఎలా అని అన్నారు. విచారణకు వేతనాలకు సంబంధం లేకుండా తక్షణమే వేతనాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ వనపర్తి జిల్లా అధ్యక్షులు శ్రీరాములు, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ సిపిఐ పట్టణ కార్యదర్శి జి.రమేష్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు కురుమయ్య కొండన్న పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

▶▶ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ▶▶ ప్రభుత్వ బడుల్లోనే మీ పిల్లలను చేర్పించండి ▶▶ బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ

**చిట్యాల, విశాలభారతి:** ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు.ప్రొ. జయ శంకర్ బడిబాడ కార్యక్రమంలో భాగంగా గుండ్రాంపల్లి గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని కోరారు. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ బడుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే బోధనా తరగతులను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు అందిస్తూ విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తూ విద్యాను అందించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ బడుల్లో చదువుకున్న ఎందరో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కొండకింది అంజిరెడ్డి, ఎంపిటిసి పద్మ కుమారస్వామి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బుస్సు అంజమ్మ, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# కంప్యూటర్ కోర్సు చేసిన వారికి సర్టిఫికేట్లు ప్రధానం



**ధర్పల్లి విశాల భారతి:** ధర్పల్లి మండల కేంద్రంలో చాణక్య టెక్నాలజీస్ వారు కంప్యూటర్ కోర్సు పూర్తి చేసిన వారికి గురువారం సర్టిఫికెట్లు ప్రధానం చేశామని చాణక్య టెక్నాలజీస్ నిర్వాహకులు చాట్ల ప్రణీత్, ప్రిన్సిపాల్ చాట్ల వాణి తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చాట్ల ప్రణీత్ మాట్లాడుతూ.. పదవ తరగతిలో 10/10 వచ్చిన విద్యార్థులకు పూర్తి ఫీజ్ 100% రాయితీ ఇవ్వడం జరిగిందని చాణక్య టెక్నాలజీస్ సంస్థలో వేసవిలో వివిధ కంప్యూటర్ కోర్సులు నేర్చుకున్న 110 మంది విద్యార్థిని-విద్యార్థులకు బ్యాచ్ ల వారిగా పరీక్షలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా సర్టిఫికెట్స్ ప్రధానం చేయడం జరిగింది. ముందుగా ప్రకటించిన విధముగా పదవ తరగతిలో 10/10 GPA మార్కులు సాధించిన విద్యార్థులు L.మేఘన-ధమన్నపేట్, P. అక్షయ, ధర్పల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు పూర్తి ఫీజు రాయితీ ఇస్తూ వారు కట్టిన ఫీజ్ కూడా తిరిగి ఇవ్వడం జరిగింది. అలాగే స్వామి వివేకానంద జయంతి రోజు ఇన్స్టిట్యూట్ తరుపున నిర్వహించిన వ్యాస రచన ఉపన్యాసా పోటిలో పాల్గొన్న విద్యార్థులకు 20% ఫీజ్ రాయితీ ఇవ్వడం జరిగింది. ఈ స ఓంవత్సరం ధర్పల్లి, సిరికొండ, ఇందల్వాయి, జక్రాన్పల్లి మండలాల నుండి దాదాపు 110 మంది విద్యార్థులు ఇక్కడ కోర్సులు పూర్తి చేసారని,గ్రామీణ ప్రాంతం లో ప్రతి విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అదించడం లక్ష్యంగా తక్కువ ఫీజ్ లో ఉత్తమ మైన కోచింగ్ అందిస్తున్నామని అన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడం లక్ష్యంగా రాయితీలు ఇస్తున్నామని నిర్వాహకులు చాట్ల ప్రణీత్, ప్రిన్సిపాల్ చాట్ల వాణి తెలిపారు.



## బడిబాటను విజయవంతం చేయాలి




▶▶ ఎంపీడీవో రాములు

**పాలకుర్తి, విశాలభారతి:** బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాలకుర్తి ఎంపీడీవో రాములు, విస్నూర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పెనుగొండ సోమన్న కోరారు. గురువారం మండలంలోని విస్నూర్ గ్రామంలోని ప్రైమరీ స్కూల్లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఎంపీడీవో రాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 6 నుంచి 19 వరకు అన్ని పాఠశాలల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించాలని, విద్యార్థుల నమోదును పెంచడానికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేస్తున్న టువంటి పనులను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని అన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తోందని, ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిం ఓచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాటూరి యాకయ్య, ఎన్నారై దొంతినేని వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ నకీర్త యాకయ్య, మాజీ ఉపసర్పంచ్ నళిని సోమేశ్వరరావు, అంగన్వాడీ టీచర్స్ శోభ, రజిత, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ నకీర్త రేణుక పాల్గొన్నారు.

## పేకాట ఆడుతున్న నలుగురు అరెస్ట్

**బాల్కొండ, విశాల భారతి:** పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారిపై కేసు నమోదు చేయడం జరిగిందని మోర్తాడ్ ఎస్సై అనిల్ రెడ్డి తెలిపారు. ఎస్సై అనిల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మోర్తాడ్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి రూ.16570 స్వాధీనం చేసుకుని నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎంపీ, ఎమ్మెల్యేలు



**డోర్నకల్,విశాలభారతి:** మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిచిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ అనుముల రేవంత్ రెడ్డిని మంత్రి సీతక్క, మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జెన్నరెడ్డి భరత్ చందర్ రెడ్డి ,ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి ,ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ ,ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ,పినకపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ,భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ,టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్ రెడ్డి, మర్యాదపూర్వకంగా కలిశారు.

## బడిబాట కార్యక్రమం చేపట్టిన ఉపాధ్యాయులు

**భీమదేవరపల్లి విశాల భారతి :** జిల్లా విద్యాశాఖ ఆదేశా మేరకు గురువారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రొ. జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ అన్ని వసతులు కలిగిన ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చేర్పించాలని కరపత్రాలు పంచుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం పత్తి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ మన ఊరు - మన బడి ద్వార పాఠశాలలో వచ్చిన మార్పు ఆహ్లాదకర వాతావరణం గురించి తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం ద్వారనే మంచి విద్యా అందుతుందన్నారు. ప్రతీ ఒక్కరు తమ పిల్లలను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజప్రభ, పద్మ, విజయభాస్కర్, రామచంద్రమూర్తి, మాజీ ఎస్ఎంసి చైర్మన్ నడిగోటి నరేష్ పాల్గొన్నారు.



# స్వయం సమృద్ధి సాధించేందుకు రైతులకు అవగాహన కల్పించాలి

▶▶ జిల్లా జడ్పీ చైర్మన్ లోక్ నాథ్ రెడ్డి



**వనపర్తి విశాల భారతి:** జిల్లా రైతులు అధిక దిగుబడులు సాధించి లాభసాటి వ్యవసాయం చేసే విధంగా అవగాహన కల్పించాలని జిల్లా పరిషత్ చైర్మన్ రాకాసి లోక్ నాథ్ రెడ్డి సూచించారు. గురువారం జడ్పి సమావేశ మందిరంలో జరిగిన 3, 4వ స్థాయి సంఘం సమావేశాలకు జడ్పి చైర్మన్ అధ్యక్షత వహించారు. 3వ స్థాయి సంఘ సమావేశంలో వ్యవసాయ అనుబంధ శాఖల పై చర్చ జరుగగా నాల్గవ స్థాయి సంఘ సమావేశంలో విద్యా వైద్యం పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ....వనపర్తి జిల్లాలో చాలా సారవంతమైన భూములు, వ్యవసాయానికి అనువైన వాతావరణం ఉంటుందనీ దీనిని సద్వినియోగం చేసుకొని రైతులు అధిక దిగుబడితో పాటు లాభసాటి వ్యవసాయం చేసేవిధంగా రైతులను అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. పామాయిల్, పప్పు ధాన్యాలు, కూరగాయలు వంటి పంటల వైపు రైతులను మల్లించాలని అందుకు రైతు వేదికలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు వ్యవసాయ రుణాలు రెన్యువల్ చేసుకోకుంటే 11 నుండి 12 శాతం వడ్డీ వేస్తారని దానితోపాటు సిబిల్ స్కోర్ పడిపోయి బిడ్డల చదువులకు సైతం బ్యాంకులు రుణాలు ఇవ్వరని అన్నారు. అందువల్ల వ్యవసాయ రుణాలు రెన్యువల్ చేయించాలని ఇందుకు బ్యాంకులు సైతం ముందుకు వచ్చి వడ్డీ తీసుకొని రుణాలు రెన్యువల్ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పి సి.ఈ.ఓ. యాదయ్య, జడ్పి వైస్ చైర్మన్ వామన్ గౌడ్, పెద్దమందడి జడ్పీటీసీ రఘుపతి రెడ్డి, ఆత్మకూరు జడ్పీటీసీ శివరంజని, జిల్లా వ్యవసాయ అధికారి డి. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కొంగాల ఘటనపై మావోయిస్టుల లేక విడుదల

**ఏసు కుటుంబానికి సానుభూతి తెలిపిన మావోయిస్టు**

**వాజేడు, విశాలభారతి:** మండల పరిధిలోని కొంగాల అటవీ ప్రాంతంలో జరిగిన ఘటనపై వాజేడు వెంకటాపురం ఏరియా కార్యదర్శి శాంత పేరిట సోషల్ మీడియా వేదికగా మావోయిస్టులు లేక విడుదల చేశారు. లేఖలో పేర్కొన్న వివరాలు ఈ విధంగా ఉన్నాయి. 3వ తేదీన కొంగాల అడవుల్లో కర్రెగుట్టపై వేట్ కోసాం వెళ్ళి బూబీట్రాప్ ని తొకకడొంతో అది పేలి జగన్నాధపురొం గ్రామానికి చెందిన ఇల్లెందుల ఏసు మరణించాడు. అతని కొడుకు స్వల్పంగా గాయపడ్డాడు. అందుకు మేము చింతిస్తున్నాం ఈ ఘటనలో చనిపోయిన ఇల్లెందుల ఏసు కుటుంబానికి మా పార్టీ తరపునసానుబూతి తెలియపరుస్నున్నాము. సామ్రాజయవాదులకు, కార్పొరేట్ ప్రయోజన్నల అడవులను కట్టపెట్టడ్డనికి స్థానిక ప్రజలకు అడవులపై ఎలాంటి హక్కులు లేకుండా చేసిఆదివాసులను అడవుల నుండితరిమి వేయాలనే పథకం రూపొందించారు. కగార్ పేరుతో మావోయిసుట పార్టటపై,.ప్రజలపై దాడులు చేస్తూ నరసంహారం కనసాగిస్తుప్రజల్లో భయంకర పరిస్థితులు కల్పిస్తున్న విషయం అందరికీ తెలిసిందే అందులో భాగంగానే వాజేడు- వెంకటాపురం ఏరియాలో కూడా మావోయిస్టు పార్టీని నిర్మూలించే లక్ష్యంతో దాడులు కోనసాగుతున్నాయి.


భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
వాజేడు-వెంకటాపురం ఏరియా కమిటీ
పత్రికా ప్రకటన

# గ్రూప్ 1 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



**వనపర్తి విశాల భారతి:** జూన్ 9న జరిగే గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ తెలిపారు. గ్రూప్ 1 పరీక్షల నిర్వహణ, వానాకాలం పంట సాగు పై గురువారం సాయంత్రం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ వనపర్తి జిల్లాలో ఏర్పాటు చేసిన 17 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. బయోమెట్రిక్ హాజరు తీసుకునేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులకు ఉదయం 9 గంటల నుండి10 గంటల వరకు పరీక్ష కేంద్రంలో అనుమతించడం జరుగుతుంది. ఉదయం 9.30 నుండి అభ్యర్థులకు బయోమెట్రిక్ హాజరు తీసుకునేందుకు, అభ్యర్థును ఫ్రిస్కింగ్ చేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అలాగే వనపర్తి జిల్లాలో అవసరమైన మేరకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వానాకాలం పంటల పై వివరిస్తూ సకాలంలో మంచి వర్షాలు కురవడానే కాకుండా నాణ్యమైన విత్తనాలు, సరిపడ ఎరువులు అందుబాటులో ఉన్నందున రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రూపు 1 ప్రిలిమినరీ పరీక్షలను సజావుగా నిర్వహించాలని అందుకు అవసరమైన పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ యం. నగేష్, ఆర్డీఓ పద్మావతి,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



**నడిగూడెం, విశాలభారతి:** బడి వీడు పిల్లలను బడిలో చేర్పించాలని తెల్లబెల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామా రావు కోరారు. గురువారం మండలం లోని తెల్లబల్లి, రత్నవరం గ్రామాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా వీధి వీధినా ప్రచారం నిర్వహిస్తూ గడపగడపకు తిరిగి ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులను పంపించండి అని కోరారు. బడి ఈడు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని నినాదాలు చేస్తూ వీధులలో కలియ తిరిగారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రధానోపాధ్యాయులు ఎం వెంకటాచారి, ముజ్బుర్ రహ్మాన్, జి సైదులు, సిహెచ్ బిక్షం, ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రామంజలి దేవి, ధనమూర్తి, శ్రీదేవి, సైదారావు, ఉమా మహేశ్వర రావు, వెంకటరమణ ,రజిని, చందూలాల్, శంకర్, వీరబ్రహ్మం, మల్లేశ్వరరావు, సి ఆర్ పి నందిగామ రామారావు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ అధ్వర్యంలో వీల్ చైర్ అందజేత



**చిట్యాల, విశాలభారతి:** రోటరీ క్లబ్ ఆఫ్ చిట్యాల అధ్యక్షులు గుండెబోయిన సైదులు ఆధ్వర్యంలో న్యూ క్లబ్ డెవలప్మెంట్ జోన్-2 చైర్మన్ డా. వెంపల్ల బుచ్చిరెడ్డి సహకారంతో సహకారంతో చిట్యాల ప్రైమరీ హెల్త్ సెంటర్ కి వచ్చే ప్రజల సౌకర్యార్థం వీల్ చైర్ అందజే యడం జరిగింది. ఈ సందర్భంగా వీల్ చైర్ ని డా.అహ్మద్ కి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా గుండెబోయిన సైదులు మాట్లాడుతూ ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చి నడవలేని వారికోసం వీల్ చైర్ అంద జేయడం జరిగిందని ముమ్ముందు కూడా రోటరీ క్లబ్ చిట్యాల ఆధ్వర్యంలో మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల శ్రీశైలం, కంభం పాటి నరసింహ, గాలి యాదగిరి ఏనుగు రవీందర్ రెడ్డి, గుండెబోయిన శివ సాయి, ఆసుపత్రి సిబ్బంది, ఎఎన్ ఎం లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# రోజు కూలీ 600 రూపాయలు ఇవ్వాలి

**సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మైదాన మండల కార్యదర్శి మాదంశెట్టి నాగేశ్వరరావు**

**బయ్యారం, విశాలభారతి:** ప్రతి ఒక్క కుటుంబానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 200 రోజులు పని దినాలు కల్పించాలని, కూలి వేతనం 600 రూపాయలు చెల్లించాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మైదాన మండల కమిటీ కార్యదర్శి మాదంశెట్టి నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. ఈనెల 10వ తేదీన బయ్యారం మండల కేంద్రంలో జరిగే నిరసన కార్యక్రమం జయప్రదం చేయాలని కోరుతూ గొల్లగూడెం, నర్సాతండా గ్రామాల పరిధిలో ఉన్న ఉపాధి కూలీల పని ప్రదేశం వద్ద కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించడం జరిగింది. ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేసే చర్యలను ప్రతి ఒక్కరు ఖండించాలని, ఈ చర్యలకు వ్యతిరేకంగా ప్రజలందరూ పోరాటం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతుకూలీ సంఘం మండల నాయకులు గుండెబోయిన లింగముల్లు, హన్మ, శేషు, పిడిఎస్యు నాయకులు నేతకాని రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

**ఆశాడే కార్యక్రమంలో డాక్టర్ దుర్గాభవాని**

**పినపాక, విశాలభారతి:** మారుమూల గిరిజన గ్రామాల ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు దుర్గా భవాని సూచించారు. పినపాక మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేశారు. ఆశా కార్యకర్తలకు నిర్దేశించిన ఆరోగ్య కార్యక్రమాలు ఏ మేరకు అమలు చేస్తున్నారు, అందజేస్తున్న వైద్య సేవలపై సమీక్షించారు. గ్రామ పంచాయతీల వారీగా వైద్య సిబ్బంది చేపడుతున్న ఆరోగ్య సేవల ప్రగతి నివేదికలను పరిశీలించారు. మారుమూల మరియు గిరిజన గ్రామాల్లో అవసరమైన మందులు, ప్రాథమిక చికిత్స అందుబాటులో ఉంచి, వారికి తగు దిశా నిర్దేశనం చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని, అందుకు అవసరమైన శిక్షణ, పరిజ్ఞానంపై ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ర్యాపిడ్ టెస్టులు ద్వారా సికిల్‌సెల్ ఎనీమియా గుర్తించే పద్ధతులపై ప్రతి ఒక్కరూ శిక్షణ పొంది తెలుసుకోవాలన్నారు. తల్లీబిడ్డ ఎక్స్ప్రెస్ వాహనం సేవలు హైరిస్కు, రక్త హీనత గర్భిణులకు వినియోగించాలన్నారు. అలాగే వ్యాక్సిన్ నిల్వలు వాటి నిర్వహణ తనిఖీ చేశారు.






# ఆర్టిఐ దరఖాస్తుకు గ్రహణం.!

**చిన్నగూడూరు,విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండల కేంద్రం/ గ్రామపంచాయతీకి సంబంధించి ఎన్ని నిధులు వచ్చాయి? ఎక్కడెక్కడ ఖర్చు చేశారు? అనే ఆరు అంశాలతో సమాచార హక్కు చట్టం ద్వారా గ్రామపంచాయతీ కి చెందిన ఇద్దరు యువకులు 14-12-2023 న అప్పటి గ్రామపంచాయతీ ఇంచార్జ్ కార్యదర్శి ప్రస్తుత ఎం.పీ.ఓ కిన్నెర యాకయ్య కి సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్నారు. సమాచారం ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో 01-03-2024 అప్పిలేట్ అధికారి ఐనా స్థానిక మండల అభివృద్ధి అధికారికి మరో మారు సమాచారం కావాలని దరఖాస్తు చేసుకోవడం జరిగింది. దీంతో అసహనం వ్యక్తం చేసన అప్పిలేట్ అధికారి సంబంధిత ఎంపీఓ యాకయ్యకు నోటీస్ ఇచ్చా రు. ఇది ఇలా వుండగా విధులకు సైతం గైరహాజరు పట్ల ఉన్నతా ధికా రి సీరియస్ గా ఉన్నట్లు సమాచారం. ఎందుకంటే ఎంపీఓ సెలవు కోరడం గాని,సమాచారం గానీ ఇవ్వకపోవడమే కారణంగా తెలుస్తుంది. ఇదే విష యమై స్థానిక ఎంపీడీవో రామారావు నీ వివరణ కోరగా సమాచారన్ని ఇవ్వడంలో ఎంపీఓ యాకయ్య జాప్యం చేస్తుండడంతో నోటీస్ ఇచ్చామని ఇట్టి విషయాన్ని ఉన్నతాధికారి దృష్టికి సైతం తీసుకెళుతున్నట్టు వెల్లడించారు.

# ఆర్థిక సాయం అందజేసిన పెద్ది కృష్ణమూర్తి గౌడ్



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలకేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎలవర్తి సోమయ్య అనారోగ్యంతో ఐదు రోజుల క్రితం మరణించగా ఈరోజు వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేసిన దేవరుప్పుల మండల మాజీ అధ్యక్షుడు,పిఎసిఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్. వారి దేవరుప్పుల కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిలుకూరి నరసయ్య,మండల యూత్ అధ్యక్షుడు ఉప్పుల అనిల్,పాము యాకన్న,కార్పోతుల నరసయ్య,కారు పోతుల శీను, రాసాల మల్లయ్య,రెడ్డి రాజుల కిష్టయ్య,కారు పోతుల మహేందర్,కొండ్రెడ్డి కృష్ణారెడ్డి,చింత ఎల్లయ్య,ఉప్పుల బాబు,కొంగ అశోక్,తోటకూరి హనుమంతు,చింత మదర్,చింత ఇస్తారి,కారు పోతుల వెంకన్న,రెడ్డి రాజుల ఎల్లప్ప,తోటకూరి రమేష్,గొడిశాల శ్రీను,కారు పోతుల యాకస్వామి, పత్తేపురం శేఖర్,కారు పోతుల సతీష్,గొడిశాల రాజు,రెగటి సోమన్న, తోటకూరి మహేష్,లొడంగి రాజు,కారు పోతుల నరేష్,ఉప్పుల రాములు, ఉప్పుల ప్రకాష్, బోనగిరి శ్రీను,చిలుకూరి ఉమేష్,కారు పోతుల సురేష్, లోడింగి యాకన్న, ఉప్పుల యాకస్వామి,ఉప్పుల బాబు,ఉప్పుల సిద్దు, కందుకూరి సాయి,తదితరులున్నారు.

# విప్లవ పార్టీలకు ఎవరు సహకరించవద్దు

**వాజేడు ఎస్ఐ వెంకటేశ్వర్లు**




**వాజేడు, శాలభారతి:** కాలం చెల్లిన సిద్ధాంతాలతో అమాయక ప్రజ ల ప్రాణాలను పట్టణ పెటుకుం టున్న విప్లవ పార్టీలకు ఎవరు సహకరించవద్దని వాజేడు ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పొంగాల గ్రామంలో గురువారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి ప్రజలతో మాట్లా డుతు మావోయిస్టుల వల్ల ప్రజ లకు నష్టం తప్ప లాభం లేదని అందువల్లనే ఎవరైనా అనుమాని తులు, కొత్త వ్యక్తులు గ్రామ పరిసర ప్రాం తాల్లో సంచరించి నట్లతే వెంటనే పోలీస్ లకు సమాచారం అందించవల్సిందిగా ఆయన కోరారు.

# బడిబాట కార్యక్రమం ప్రారంభం




**వాజేడు, విశాలభారతి:** మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వాజేడు నాగారం యందు ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని మం డల విద్యాశాఖ అధికారి వాజేడు తేజావత్ వెంకటేశ్వరరావు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని పాఠశాలలు ఉదయం ఏడు నుంచి 11 గంటల వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించాలని, విద్యార్థుల నమోదును పెంచడానికి కృషి చేయాలని, పాఠశాల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేస్తున్నటువంటి పనులను క్షేత్రస్థాయికి తీసుకొని వెళ్లి విద్యార్థుల నమోదు పెంచాలని వారు కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనందరావు, AAPC VO, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో సమస్యలు పరిష్కరించాలి



**వనపర్తి విశాల భారతి:** మాపై శ్రద్ధ చూపి మాకు డబల్ బెడ్ రూమ్స్ ఇప్పించి ఆదుకున్నా డబల్ బెడ్ రూమ్ కనీస వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మొరపెట్టుకున్నారు. ప్రస్తుతం అక్కడ కనీస సౌకర్యాలు లేక బాధపడుతూ డబల్ బెడ్ రూమ్స్ వాసులు వాటిని తీర్చమని మాజీమంత్రినీ విన్నవించారు. కరెంటు లేక తీవ్ర ఇబ్బందులు,రోడ్ ఇరువైపులా లైట్లు వేయాలనీ కోరుతున్నారు. మంచినీటి సౌకర్యం మధ్యలో ఆగిపోయిన సి.సి.రోడ్, పారిశుధ్యం లోపించడం,వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. స్పందించిన నిరంజన్ రెడ్డి అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్థామని అన్నారు. స్వయంగా ఒకసారి వచ్చి పరిశీలి స్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నాగమ్మ, సుజాత,అరుణ,శేహానాజ్,వజ్రాల.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రైతుకు పచ్చిరొట్ట విత్తనాలు అందించాలి

▶▶ ఏఐకేఎంఎస్ తొర్రూరు డివిజన్ అధ్యక్షుడు ఊడుగుల లింగన్న



**మహబూబాబాద్, విశాలభారతి:** నర్సింహులపేట మండల వ్యవసాయ అధి కారి కి ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా లింగన్న మాట్లాడుతూ..తొలకరి సీజన్ ప్రారంభమవుతుంది రైతాం గం వ్యవసాయ పనులు మొదలుపెట్టడానికి సమాయత్తమవుతున్నారు. ప్రతి సంవత్సరం నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువుల బెడదతో రైతు నష్టపో తున్నారు. విత్తనాల, ఎరువుల కొరతను నివారించుటకు రాష్ట్ర ప్రభుత్వం నకిలీ విత్తన, ఎరువుల కంపెనీలను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసు కోవాలి, నాణ్యమైన విత్తనాలను సబ్సిడీతో రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా రైతు లకు అందించాలి, అదేవిధంగా పిల్లి పెసర, జిలుగు, జనుము వంటి పచ్చి రొట్ట ఎరువులను సకాలంలో అందించాలి. కార్యక్రమంలో జిల్లా నాయ కులు చిర్రా యకన్న, పిడిఎస్యు జిల్లా నాయకులు గోడిశాల మనోజ్, మండ ల నాయకులు యాకసాయిలు, బాణోత్ సర్వన్, కొమురయ్య, పెంటయ్య, ఐలయ్య, సాయన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గవర్నమెంట్‌లో దొరకని పంటి వైద్యం




**భద్రాచలం, విశాలభారతి:** పట్టణంలోని వందపడకల గవర్నమెంట్ హాస్పిటల్ లో పంటి వైద్యం ఒక విభాగం కానీ పంటి వైద్యానికి పోతున్న నిరుపేద ప్రజలకు పంటి వైద్యం అందని ద్రాక్షగా మారింది ఎవరన్నా పంటి బాధతో పోతే అది ఎంత ఇబ్బందిగా ఉన్న సరే మందులతో సరిపె ట్టుకుంటున్నారు. తగ్గని పక్షంలో ప్రైవేట్ క్లినిక్ కి రమ్మని సిఫార్సు చేస్తున్నారు. వంద పడకల సర్కారు దవాఖానలో పన్ను బాధతో పోతే ఇక్కడ వైద్యం లేదు ప్రైవేటుకు రండి అని చెప్పడం ఆ పంటి వైద్యులకు పరిపాటిగా మారింది. కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ప్రభుత్వం 100 పడకల ఆసుపత్రిని కడితే అక్కడ కనీసం పన్నుకు వైద్యం లేకపోవడం చాలా ఆశ్చర్యకరం. బయట ప్రైవేట్ వైద్యం చేయాలంటే సాధారణమైన ఒక్కో పన్నుకు 8000 దాకా పన్ను రేటు ఉంటుంది ఇంకా పన్నుల నాణ్యతను బట్టి దాని రేటు ప్రైవేట్ వైద్యులు నిర్ధారిస్తున్నారు. పళ్ళ చెట్టుకు వేరే ధర ఉంటుంది. ఇలా కేవలం ఒక దంతాల విషయంలో ప్రైవేట్ వైద్యంలో వేలకు వేలు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

## పేద కుటుంబానికి ఆర్థికసాయం



**శాలిగౌరారం, విశాలభారతి:** శాలిగౌరారం మండలం తక్కళ్ల పహాడ్ గ్రామంలో లో నిరు పేద చెరుకు సోమమ్మ అనారో గ్యంతో మరణిం చింది. ఆ కుటుంబానికి తీవ్ర సానుభూతి వ్యక్తం చేస్తూ గ్రామానికి చెంది న కాంగ్రెస్ నాయకులు కట్టం గూరి మహేం దర్ రెడ్డి,కట్టంగూరి సురేందర్ రెడ్డిలు మృతురాలు మను మడు చెరుకు ఉపేందర్ కు 5116 రూపాయలు అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు తీరుపారి మల్లయ్య, వజ్జే బిక్షమయ్య, చెరుకు జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## నీట్‌లో 573 వ ర్యాంక్ సాధించిన గిరిజన ఆణిముత్యం



**కరకగూడెం, విశాలభారతి:** మండల పరిధిలోని తాటిగూడెం గ్రామానికి చెంది పోలెబోయిన గంగరాజు (టీచర్ ) ధనలక్ష్మి దంపతుల కుమార్తె పోలెబోయిన రిషిత ఎంబీబీఎస్, బిడిఎస్ కోర్సుల కోరకు ఎన్ టిఎ దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ 202 4 ప్రవేశ పరీక్షలో గిరిజన ఆణిముత్యం పోలె బోయిన రిషిత, మొత్తం 720 మార్కులకు 596 మార్కులు సాధించి ఆల్ ఇండియా ఎస్టీ కోటలో 573 వ ర్యాంకు సాధించింది. అమె ఆల్ ఇండియా ర్యాంకు సాధించడంతో మండల ప్రజలు, అధికారులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# స్కూల్ యూనిఫామ్ లను సకాలంలో అందించాలి



▶▶ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక

**ఇబ్రహీంపట్నం ,విశాలభారతి:** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ లను సకాలంలో అందించడం పై గురువారం జిల్లా కలెక్టర్ శశాంక, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ తో కలిసి సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ లను సకాలంలో అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. స్కూల్ యూనిఫామ్ లను కుట్టి విద్యార్థిని, విద్యార్థులచే ట్రయిల్ చేయించి యూనిఫామ్ లో తేడాలు ఉంటే సరిచేయాలని సూచించారు. విద్యార్థుల కొలతలకు అనుగుణంగా నాణ్యతతో యూనిఫామ్ లు కుట్టేలా పర్యవేక్షణ జరపాలని, నిర్దిష్ట గడువులోగా తయారీ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలన్నారు. మహిళా స్వయం సహాయక కేంద్రాల్లో యూనిఫామ్స్ తయారీ పూర్తి అయిన వెంటనే సంబంధిత ప్రధానోపాధ్యాయులకు అందించాలన్నారు. ఇప్పటి వరకు 49% మేరకు యూనిఫామ్స్ సిద్ధం చేశారని అన్నారు. ప్రతి రోజూ సగటున ఎన్ని యూని ఫామ్స్ తయారు చేస్తున్నారనే తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 10 వ తేదిలోపు యూనిఫామ్ లు ఆయా బడులకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. యూనిఫామ్ ల పంపిణీకి సంబంధించిన ప్రగతి నివేదికలను తనకు రోజు వారీగా అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, జిల్లా విద్యశాఖ అధికారి సుశీందర్ రావు, జిల్లా మెప్మా అధికారి మల్లీశ్వరి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలి

▶▶ పినపాక ఎంపీడీవో రామకృష్ణ



**పినపాక, విశాలభారతి**: గ్రామపం చాయతీలలో సెక్రటరీలు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వ హించాలని పినపాక ఎంపీ డీవో రామకృష్ణ సూచించారు. గురువా రం పినపాక ఎంపీడీవో కార్యాల యంలో సెక్రెటరీలతో సమావేశా న్ని ఏర్పాటు చేశారు. రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా నీరు నిలువ ఉండే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి పన్నుల వసూలు 100 శాతం పూర్తి చేయాలని సూచించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో సెక్రటరీలు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో పినపాక ఎంపీ ఓ వెంకటేశ్వరరావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ విజయకృష్ణ, సెక్రటరీలు పాల్గొన్నారు.

## అధైర్య పడకండి అండగా ఉంటాం



**కరకగూడెం, విశాలభారతి:** మండలంలో పినపాక నియోజక వర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు గారి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ కరకగూ డెం మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ తాటిగూడెం, పద్మాపురం, చొప్పాలా, గొల్లగూ డెం, కొత్తగూడెం గ్రామా పంచా యితీలలో బుధవారం నాడు ఉరుములు, గాలి దుమ్ముతో కురి సిన వర్షానికి కూలిపోయిన ఇల్లులను పైకప్పులను పరిశీలించారు. అదేవిధంగా కొత్తగూడెం గ్రామంలో పిడుగుపాటుకు మృతి చెందిన ఇర్ప రామారావు, మంకిడి బాబు, మంకిడి నారాయణ అనే రైతులకు చెందిన దుక్కిటి ఎడ్లను సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ. సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరు అధైర్య పడొద్దు అని వారికి జరిగిన నష్టానికి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే విధంగా చూస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగ బండి వెంకటేశ్వర్లు, కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## విత్తన దుకాణాలను తనిఖీ చేసిన కలెక్టర్



**మహబూబాద్, విశాలభారతి:** కలెక్టర్ అద్వై త్ కుమార్ సింగ్ జిల్లా వ్యవసాయ అధికారి అభిమన్యుడుతో కలిసి మహబూబాద్ పట్టణ ంలోని విత్తన దుకాణం, కిసాన్ అగ్రిమాల్ ను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగినది. ఈ తనిఖీలో బాగంగా విత్తన దుకాణంలో వున్న పత్తి, మిర్చి, వరి మొక్కజొన్న విత్తనాల స్టాక్ వివరాలు స్వయంగా పరిశీలించడం జరిగినది. ధరల పట్టిక ఇన్వాయిస్, స్టాక్ రిజిస్టర్, రోజు వారిగా జరిగిన అమ్మకం మరియు రైతుల వివ రాలు, రైతు వారిగా అమ్మిన విత్తన రిజిస్టర్ లను పరిశీలించారు. దుకాణంలో అనుమతిలేని విత్తనాలు, నకిలీ విత్తనాలు అమ్మిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారిని ఆదేశించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అమ్మే విధంగా చూడాలని తెలిపారు.

## బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభం



**పాలకీడు, విశాలభారతి:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేరేడు చర్ల నందు ప్రొఫెసర్ జయశం కర్ బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మండ ల విద్యాధికారి పానుగోతు చత్రు నాయక్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశా లల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెంచుకునే సదవకాశంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు ఉపయోగించుకోవాలని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థిని విద్యార్థులకుగల సౌకర్యాల కల్పన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధన, ఎస్ఎస్సి లో మెరుగైన ఫలితాలు సాధిస్తున్న తదితర అంశాలను కరపత్రాల ద్వారా వివరిస్తూ పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు.


## నరసింహాచారికి నివాళులర్పించిన దూదిమెట్ల



**చిట్యాల, విశాలభారతి:** నేరడ గ్రామానికి నాగార్జున నరసింహ చారి గత కొద్దికాలం క్రితం అనారోగ్యంతో మరణించడం జరిగింది. గురువారం జరిగిన నరసింహ చారి సంతాప సభ లో ఫిష్ అండ్ గోట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ పాల్గొని అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట బాలాపూర్ కాంగ్రెస్ సీనియర్ సీనియర్ నాయకులు అందోజు లక్ష్మణాచారి, ఆవుల ఆనంద్, శ్రీనివాస చారి, మారోజు శ్రీనివాస్ చారి, మారోజు మహేష్, దుబ్బాక నవీన్ రెడ్డి, మారోజు కిరణ్,మారోజు రాజు తదితరులున్నారు.

## భవనంపై నుంచి కింద పడి కార్మికుడు మృతి

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** నిర్మాణంలో ఉన్న బిల్డింగ్ పై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నలగండ్లలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.నలగండ్లలో రంజై వైభవ్ అనే సంస్థ నిర్మాణాలు చేపట్టింది. అండర్ కన్స్ట్రక్షన్ లో ఉన్న భవనంలో పనిచేస్తుండగా భవనం పైనుంచి పడి రమేష్ సింగ్ (40) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చందానగర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్ తరలించారు. అయితే రమేష్ ఎలా చనిపోయాడు.నిర్మాణ సంస్థకు అనుమతులు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# బీడీఎల్ టౌన్ షిప్‌లో ఉచిత వైద్య శిబిరం

▶▶ యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అధ్వర్యంలో కార్డియో చెకప్



**పటాన్ చెరు,విశాలభారతి:** పటాన్ చెరు మండలం భానూర్ గ్రామ పరిధిలోని బీడీఎల్ టౌన్ షిప్ లో గురువారం యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఫ్రీ కార్డియో చెకప్ మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీడీఎల్ భానూర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషన్ ముఖ్యఅతిథిగా హాజరై మెడికల్ క్యాంపును ప్రారంభించారు. ఈ మెడికల్ క్యాంపులో సుమారుగా 200 మందికి బీపీ, షుగర్, ఈసీ, 2డిసిఓ పరీక్షలు జరిపి వారికి కావలసిన మందులను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీడీఎల్ బీడీఈఎల్ టీయూసీ-ఐఎన్టీయూసీ గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు ఎండి.అహ్మదుల్లా, కార్యవర్గం, యశోద ఆసుపత్రి కార్డియో డాక్టర్ల బృందం, యశోద మార్కెటింగ్ జీఎం రమేష్ పాల్గొన్నారు. వైద్య శిబిరంలో సేవలు అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ఐఎన్టీయూసీ యూనియన్ తరపున వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.





## భార్యపై అనుమానంతో గొంతు కోసిన భర్త

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** అనుమానంతో కట్టుకున్న భార్యను విచక్షణ కోల్పోయిన భర్త గొంతుకోసి దారుణంగా హత్యకు యత్నించిన ఘటన చందానగర్ పోలీసు స్టేషన్ పరిధిలోగురువారం వెలుగుచూసింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలా ప్రకారం.. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిదిలోని ఓల్డ్ ఎంఐజీ కాలనీలో నివాసముంటున్న తులసి(45) భర్తతో గొడవల కారణంగా వేరుగా తన పిల్లలతో కలిసి స్థానికంగా నివాసం ఉంటూ అక్కడే కర్రీ పాయింట్ నడుపుతుంది. చాలాకాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో వేరు వేరుగా ఉంటున్నారు. గతంలో తులసిపై అనుమానంతో ఆమె భర్త జగన్నాథం గొడవలు పడేవాడు. పలుమార్లు ఇరువురికి పెద్దలు నచ్చచెప్పినా వీరి మధ్య సయోధ్య కుదరలేదు. భార్యపై అనుమానంతో రగలిపోతున్న జగన్నాథం బుధవారం రాత్రి ఆమె ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఆమె గొంతుకోసి పారిపోయాడు. బాధితురాలి అరుపులతో అక్కడికి చేరుకున్న స్థానికులు తీవ్రరక్త స్రావంతో బాధపడుతున్న బాధితురాలిని నలగండ్లలోని సిటిజెన్ హాస్పిటల్కు తరలించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితురాలికి చికిత్స కొనసాగుతుంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న చందానగర్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## బడిబాట కార్యక్రమం ప్రారంభం



**బాల్కొండ,విశాలభారతి:** బడిబాట కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు భీమ్గల్ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించడం జరిగిందని భీమ్గల్ మండల విద్యాశాఖాధికారి స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిబాట కార్యక్రమంలో బడి ఈడు పిల్లలను,అలాగే బాల కార్మికును గుర్తించి బడిలో చేర్పినట్లు తెలిపారు.ప్రైమరీ,ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని అన్నారు. మహిళ సంఘాల సహాయంతో పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘుదాస్, రాజ్ కుమార్,లింగయ్య, విద్యాసాగర్,గంగా దాస్,భాగ్యలక్ష్మి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ని కలిసిన యువనేత

▶▶ చిలుక మధుసూదన్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని యువనాయకుడు ,టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి గురువారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి , శాలువాతో సన్మానించారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి ఘన విజయం సాధించడం , అతని గెలుపు కోసం కష్టపడ్డందుకు చిలుక మధు సుధన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం ఉంటుందని ,అనేక మంది మేధావులకు, దేశం కోసం త్యాగం చేసిన వారికి కాంగ్రెస్ పార్టీ అత్యున్నత పదవులను ఇచ్చిందని గుర్తు చేశారు.

## కిరణ్ కుమార్ రెడ్డికి శుభాకాంక్షలు

**తుర్కయంజాల్, విశాలభారతి:** భువనగిరి పార్లమెంట్ సభ్యులుగా నూతనంగా ఎన్నికైన చామల కిరణ్ కుమార్ రెడ్డిని పెద్ద అంబర్ పేట్ క్యాంప్ కార్యాలయంలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరితాధన్ రాజ్ మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇంజాపూర్ ఆపిల్ కాలనీ అధ్యక్షుడు నాయిని చెన్నా రెడ్డి, పెసరకాయలా నర్సింహ రెడ్డి, కాంగ్రెస్ తుర్కయంజాల్ మున్సిపాలిటీ మైనారిటీ అధ్యక్షులు మహమ్మద్ గౌస్ పాషా తదితరులు పాల్గొన్నారు.



# వానాకాలం సాగుకు సన్నద్ధం



**ఆర్మూర్, విశాల భారతి :** వానకాలం పంటలను సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే దుక్కులను దున్నడం, విత్తనాలను కొనుగోలు పనుల్లో రైతులు బిజీ బిజీగా ఉన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో చాలా గ్రామాలలో పసుపు పంటను విత్తుకున్నారు. గత సంవత్సరం ఆశించిన మేరకు ధర పలకడంతో పసుపును ఎక్కువ మొత్తంలో సాగు చేస్తున్నారు. ప్రభుత్వం ఎకరానికి వరి కి రూ.500 బోనస్ ఇవ్వడంతో అధికంగా వరి పంటను సాగు చేస్తున్నారు.

### తొలకరి జల్లులు కురిస్తే

నిజామాబాద్ జిల్లాలో ప్రధానంగా వరి, మొక్కజొన్న, పసుపు పంటను రైతులు అధికంగా సాగు చేస్తారు. తొలకరి జల్లులు కురవగానే మొక్కజొన్నను విత్తుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే నారుమడులను సిద్ధం చేసి నారును పోశారు. ముందస్తుగా సమృద్ధిగా వర్షాలు కురవకపోతే కొంతమేరకు నష్టం జరిగే అవకాశం ఉంది. గురువారం తొలకరిజల్లులు కురిసాయి వాతావరణం ఒకసారిగా చల్లబడింది రైతులు సాగు పనులలో బిజీబిజీగా మారనున్నారు.

### నకిలీ విత్తనాలను అరికట్టేందుకు తనిఖీలు

వానాకాలం సీజన్ షురూ కావడంతో రైతులు విత్తనాలు కొనుగోలు చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు పెస్టిసైడ్ షాపులలో ఇప్పటికే తనిఖీలు చేసి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పురుగు మందులను నకిలివి అందిస్తున్నారని కొందరు రైతులు అంటున్నారు. విత్తనాలకు సంబంధించిన రసీదులను ఉంచుకోవాలి వ్యవసాయ అధికారులు తనిఖీ సందర్భాలలో అన్నారు.

### సాగు అంచనా

నందిపేట్ డొంకేశ్వర్ మండలాలలో సుమారుగా 25వేల ఎకరాలలో వరి పంటల సాగు చేస్తారు. 2500- 3000 ఎకరాలలో పసుపు.. 2000 ఎకరాలలో సోయాబీన్.. 2000-3000 ఎకరాలలో మొక్కజొన్నను సాగు చేస్తారు. వర్షాలు సమృద్ధిగా కురిసిన తర్వాత భూమిలో తేమ వస్తుంది. కావున విత్తనాలు విత్తుతే మొలక శాతం పెరుగుతుంది అని జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు.

## కోహెడలో బడిబాట కార్యక్రమం




**తుర్కయంజాల్, విశాలభారతి:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరి ధి కోహెడలో బడిబాట కార్యక్ర మం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశా లల్లో చిన్నారులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, గు డ్లు, నాణ్యమైన భోజనం అందిస్తుందని తల్లిదండ్రులను చైతన్య పరిచారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, తప్పకుండా పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు తిరుపతి భాయి, పాఠశాల కమిటీ ఏ ఏ పి సీ అధ్యక్షురాలు పోచిగారి స్వప్న, ఉపాధ్యాయులు దన్నె రాజు, జగన్ రాజు, నరసింహ, లక్ష్మణ్, గోపాల్ రెడ్డి, రాధా మాధవి, కొండయ్య, మంజుల, జగదీశ్వర చారి, కృష్ణ కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

## కర్కశంగా పశువులను కుక్కిన వాహనం పట్టివేత



**ఇబ్రహీంపట్నం , విశాలభారతి:** మెడకు తాళ్ళు కట్టి , కర్కశంగా పశువులను కుక్కి కబేళాలకు తరలిస్తున్న డీసీఎం వ్యాన్ ను గురువారం యాచారం పోలీసులు పట్టుకున్నారు. యాచారం ఎస్ఐ వెంకటనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండలం మల్లేపల్లి సంతలో రమేష్, కే నరేందర్ 14 ఆవులను కొనుగోలు చేశారు. వాటిని ఓ వాహనంలో డ్రైవర్ సిగ శివతో కలిసి హైదరాబాద్లోని కబేళాకు తరలిస్తుండగా ఉదయం 9 గంటల సమయంలో మాల్ చెక్ పోస్ట్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అక్రమంగా 14 ఆవులను తరలిస్తున్నట్లు గుర్తించి, పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు...

## గీతా రెడ్డి ఆశీర్వాదం తీసుకున్న శ్రీగణేష్



**విశాలభారతి, జూన్ :** కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంగా తన రాజకీయ గురువు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి వర్యులు శ్రీమతి గీతా రెడ్డితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. గురు దక్ష ణ సమర్పించుకున్నారు. ఈ సంద ర్భం గా ఆమెను శాలువా కప్పి,పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కంటోన్మెంట్ శాసన సభ్యు డుగా విజయం సాధించిన శ్రీగణేష్ తొలిసారిగా గీతా రెడ్డి ని ఆమే స్వగృహం లో కలిశా రు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్‌కు శుభాకాంక్షల వెల్లువ

▶▶ జనసేన పార్టీ నాయకుడు ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్

**కూకట్ పల్లి విశాలభారతి:** మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ కు కూకట్ పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. కూకట్ పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ నాయకుడు ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, జనసైనికులు, వీర మహిళలు మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడిగా అఖండ మెజార్టీతో గెలిచిన ఈటెల రాజేందర్ తన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం కొల్లా శంకర్, వేముల మహేష్, కాకాని లక్ష్మణ్ రావు, డివిజన్ ప్రెసిడెంట్ కలిగినిడి ప్రసాద్, అడబాల షణ్ముఖ, ఎర్ర రఘు, మండలి అనిల్, ఆవుల రంగబాబు, పులగం సుబ్బు , విజయ్, యోగేష్ , సురేష్ మరియు వీర మహిళలు అడబాల లక్ష్మి , సత్య ఎర్ర, రాధిక , జానవి , లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# ఢిల్లీ వెళ్ళిన బీజేపీ నూతన ఎంపీలు

▶▶ నేడు మోడీ, అమిత్ షా, నడ్డాలతో మర్యాదపూర్వక భేటీ

▶▶ తెలంగాణలో విజయంపై వివరణ

**విశాలభారతి,స్టేట్ బ్యూరో :** పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన ఎంపీలంతా హస్తిన బాట పట్టారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇప్పటికే ఢిల్లీలో ఉన్నారు. కాగా డీకే అరుణ గురువారం హస్తినకు పయనమయ్యారు. మూడు రోజుల పాటు ఆమె ఢిల్లీలోనే ఉండనున్నారు. మిగతా ఎంపీలు సైతం ఒక్కొక్కరుగా క్రమంగా ఢిల్లీకి చేరుకుంటున్నారు. శుక్రవారం మోడీ, అమిత్ షా, నడ్డాతో మర్యాదపూర్వకంగా భేటీ కానున్నారు. అలాగే ఢిల్లీలోని మోడీ నివాసంలో ఎన్డీయేకు చెందిన ఎంపీలతో కీలక భేటీ ఉన్న నేపథ్యంలో ఎం పీ లం తా ఒక్కొక్కరుగా దేశ రా జ ధా ని కి చేరుకుంటున్నారు. ఇదిలాఉండగా శుక్రవారం ఎంపీలతో భేటీ, 9వ తేదీన మోడీ ప్రధానిగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో వారంతా అక్కడే ఉండనున్నారు. తొలుత ఈనెల 8న మోడీ ప్రమాణ స్వీకారం చేస్తారని అనుకున్నారు. కానీ ఆ షెడ్యూల్ ను ఆదివారానికి మార్చుకున్నారు. ఇదిలా ఉండగా బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో పార్టీ అగ్రనేతల సమావేశం గురువారం జరిగింది. సమావేశానికి హాజరైన అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, ఇతర సీనియర్ నేతలు హాజరయ్యారు. సమావేశంలో బీజేపీ నేతలతో పాటు ఆర్ఎస్ఎస్ నేతలు సైతం ఉన్నారు. సంఘ్ నుంచి సురేష్ సోని, అరుణ్ కుమార్, దత్తాత్రేయ హొసబెళె హాజరయ్యారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటు, మిత్రపక్షాలకు మంత్రివర్గంలో వాటా, మంత్రివర్గ కూర్పుపై కసరత్తు చేస్తున్నట్టు సమాచారం.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

సినిమా
www.vishalabharati.com
epaper:vishalabharati.com

శుక్రవారం,
07.06.2024
హైదరాబాద్

vishalabharathi Telugu Daily



# కల్కి.. కమల్ కనిపించేది ఎంత సేపు?

విలక్షణ నటుడు కమల్ హాసన్.. 2024లో వరుస సినిమాలతో అలరించనున్న విషయం తెలిసిందే. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో లీడ్ రోల్ లో నటించిన ఇండియన్2తో సందడి చేయనున్నారు. 28 ఏళ్ల క్రితం వచ్చిన సూపర్ హిట్ భారతీయుడు మూవీకి సీక్వెల్ గా వస్తుండడంతో సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి. జులై 12వ తేదీన వరల్డ్ వైడ్ గా రిలీజ్ చేస్తున్నట్లు ఇండియన్ 2 మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేశారు. అంతకన్నా ముందు.. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కల్కి 2898 ఏడీ చిత్రంతో కూడా కమల్ ఆడియన్స్ ను పలకరించనున్న సంగతి తెలిసిందే. ఈ మూవీలో ఆయన పూర్తిస్థాయి పాత్ర చేస్తున్నారని చాలా నెలలుగా వార్తలు వస్తున్నాయి. కానీ తనది మూవీలో గెస్ట్ రోల్ అని ఇటీవల చెప్పి షాకిచ్చారు. ఇప్పటికే తన షూటింగ్ పార్ట్ కూడా కంప్లీట్ అయినట్లు తెలిపారు. తన కెరీర్ లో ఇలాంటి మూవీ ఇప్పటి వరకు చేయలేదని చెప్పి అంచనాలు పెంచారు. అయితే కల్కిలో కమల్ హాసన్ స్క్రీన్ టైంకు సంబంధించి ఇప్పుడు నెట్టింట జోరుగా చర్చగా సాగుతోంది. సినిమాలో కమల్ చాలా తక్కువ సమయం కనిపిస్తారని కొందరు అంటున్నారు. కేవలం రెండే రెండు నిమిషాలు కనిపిస్తారని చెబుతున్నారు. ఇంకొందరు 5 నిమిషాల పాత్ర ఉంటుందని గెస్ చేస్తున్నారు. కానీ కమల్ రోల్ టైం తక్కువ సేపు ఉన్నా ..మంచి ఇంపాక్ట్ కలిగి ఉన్న పాత్ర అని లేటెస్ట్ అప్డేట్ వినిపిస్తోంది. 12 నిమిషాల పాటు కమల్ సందడి చేయనున్నారని ఇండస్ట్రీ నుంచి వార్తలు వస్తున్నాయి. సెకండాఫ్ లో కనిపిస్తారని.. కమల్ రోల్ తోనే మూవీ ఎండ్ అవుతుందని తెలుస్తోంది. విలన్ లాంటి రోల్ లో కమల్ అలరించనున్నారని వినికిడి. ప్రస్తుతం ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. కమల్ తో పాటు సినిమాలో అమితాబ్ బచ్చన్, దీపిక పదుకొనె, దిశా పటాని, బ్రహ్మానందం సహా పలువురు నటీనటులు కనిపించనున్నారు. సైన్స్ ఫిక్షన్ డిస్టోపియన్ జోనర్ లో టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను సీనియర్ ప్రొడ్యూసర్ అశ్వనీదత్ నిర్మిస్తున్నారు. రూ.600 కోట్లకు పైగా భారీ బడ్జెట్ తో రూపొందిస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే ప్రమోషన్స్ కూడా చేస్తున్నారు. జూన్ 10వ తేదీన ట్రైలర్ ను విడుదల చేయనున్నారు. వరల్డ్ వైడ్ గా జూన్ 27వ తేదీన రిలీజ్ కానున్న ఈ చిత్రం ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.



# బాబాయ్ గెలుపు .. అబ్బాయి సంబురం !

ఏపీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించింది. జనసేన తరపున పోటీ చేసిన 21 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఏపీలో కూటమి ఊహించని విధంగా భారీ విజయం సాధించింది. గత ఎన్నికల్లో భీమవరం, గాజువాక స్థానంలో ఓటమి పాలైన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఈ సారి పిఠాపురం నుండి 70 వేల పైచిలుకు ఓట్లతో విజయం సాధించడమే కాకుండా పోటీచేసిన అన్ని స్థానాల్లో విజయం సాధించాడు. పవన్ విజయంపై మెగా ఫ్యామిలీతో పాటు మహేష్ బాబు , ఎన్టీఆర్, వెంకటేష్, దళపతి విజయ్, సూపర్ స్టార్ రజినీకాంత్ పవన్ కళ్యాణ్ పై ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే ఇప్పడు టాలీవుడ్ లో మరొక ఇంట్రెస్టింగ్ వార్త వైరల్ అవుతుంది. బాబాయ్ గెలుపును రామ్ చరణ్ ఓ గ్రాండ్ పార్టీని ఏర్పాటు చేయనున్నాడని తెలుస్తుంది. హైదరాబాద్ లో జరిగే ఈ పార్టీకి సినీ ప్రముఖులతో పాటు రాజకీయ ప్రముఖులు కూడా హాజరుకానున్నారని తెలుస్తుంది.

# నేను ఎప్పుడూ దాన్ని నెగెటివ్ గా చూడను

సమంత



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ఏడాది బ్రేక్ తర్వాత ఎట్టకేలకు కెమెరా ముందుకు వచ్చింది. ప్రస్తుతం ఆమె సినిమాల షూటింగ్స్ తో పాటు కమర్షియల్ యాడ్స్ షూటింగ్ లో కూడా పాల్గొంటున్నట్లుగా ఆమె సన్నిహితుల ద్వారా సమాచారం అందుతోంది. తాజాగా ఈఅమ్మడికి ఐఎండీబీ విడుదల చేసిన మోస్ట్ వ్యూడ్ ఇండియన్ స్టార్స్ జాబితాలో చోటు దక్కింది.ఎంతో మంది బాలీవుడ్ స్టార్స్ తో పాటు సౌత్ స్టార్స్ ని వెనక్కి నెట్టి మరీ సమంత ఏకంగా 13వ స్థానంలో నిలిచింది. ఈ విషయమై తాజాగా ప్రముఖ జాతీయ మీడియా సంస్థతో మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించింది. తనకు దక్కిన గుర్తింపుతో మరింత బాధ్యత పెరుగుతుందని చెప్పకొచ్చింది. ఐఎండీబీ ర్యాంకింగ్ లో 13వ స్థానం దక్కించుకోవడం చాలా సంతోషంగా ఉంది. నా కష్టానికి దక్కిన ప్రతిఫలం ఇది. కెరీర్ ను ఇప్పడే కొత్తగా మొదలు పెట్టినట్లుగా ఉంది. అప్పడే ఇన్ని సంవత్సరాలు గడిచి పోయాయి అంటే ఆశ్చర్యంగా ఉంది, నమ్మలేకుండా ఉన్నాను అంది. ఇండస్ట్రీలో పోటీ వల్ల మంచి జరుగుతుందని నేను భావిస్తున్నాను. ప్రతి రంగంలో కూడా ఒకరితో ఒకరు పోల్చుకుని, ఒకరి కంటే మరొకరు ఎక్కువగా కష్టపడాలని, మంచి గుర్తింపు తెచ్చుకోవాలని కోరుకుంటూ ఉంటారు. ఇతరుల విజయాలను చూసి నేను ఎప్పడూ స్ఫూర్తి పొందుతాను. ఇండస్ట్రీ లో ఉన్న పోటీని నేను ఎప్పడు కూడా నెగెటివ్ గా చూడను. నాకు పోటీ అనేది మరింతగా స్ఫూర్తిని ఇస్తుంది. ఇతరులను చూసి నేర్చుకుంటాను తప్ప నెగెటివ్ గా ఆలోచించి కెరీర్ లో నష్టపోను అంటూ సమంత చెప్పకొచ్చింది. ప్రస్తుతం సమంత నటించిన సిటాడెల్ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కు రెడీ అవుతుంది. మరో వైపు మా ఇంటి బంగారం అనే సినిమాలో నటిస్తుంది. ఆ సినిమా ను ఈ ఏడాది చివర్లో ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. గత ఏడాది ఖుషి చిత్రంతో మంచి విజయాన్ని సొంతం చేసుకున్న సమంత మరిన్ని సినిమాలతో ముందు ముందు వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తుంది.

# 'మనమే' బ్యూటీఫుల్ స్టోరీ, ఎమోషన్స్ వున్న కంప్లీట్ ఎంటర్‌టైనర్

: ప్రీరిలీజ్ ఈవెంట్ లో ఛార్మింగ్ స్టార్ శర్వా




ఛార్మింగ్ స్టార్ శర్వా తన ల్యాండ్‌మార్క్ 35వ మూవీ 'మనమే' తో హోల్సమ్ ఎంటర్ టైన్మెంట్ ని అందించడానికి రెడీగా వున్నారు. ఈ చిత్రంలో కృతి శెట్టి హీరోయిన్ గా నటిస్తున్నారు. ట్యాలెంటెడ్ డైరెక్టర్ శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై రామ్‌సే స్టూడియోస్ ప్రొడక్షన్ లో నిర్మాత టిజి విశ్వప్రసాద్ అత్యంత గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, ఇతర ప్రమోషనల్ కంటెంట్ ట్రెమండస్ రెస్పాన్స్ తో హ్యుజ్ బజ్ ని క్రియేట్ చేశాయి. 'మనమే' జూన్ 7న థియేటర్లలో గ్రాండ్ గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ వేడుకలో నిర్మాత టీజీ విశ్వప్రసాద్ శర్వాకు 'ఛార్మింగ్ స్టార్' టైటిల్ ఇచ్చారు. ఈ మేరకు రూపొందించిన స్పెషల్ వీడియోను ఈవెంట్ లో ప్రజెంట్ చేశారు. గ్రాండ్ గా జరిగిన ఈ వేడుకలో స్టార్ డైరెక్టర్స్ మారుతి, శివ నిర్వాణ, సాయి రాజేష్, కిషోర్ తిరుమల అతిధులుగా పాల్గొన్నారు. ప్రీరిలీజ్ రిలీజ్ ఈవెంట్ లో ఛార్మింగ్ స్టార్ శర్వా మాట్లాడుతూ.. స్వామి శరణం. అందరికీ నమస్కారం. ముందుగా మనమే వస్తామని చెప్పి ముచ్చటగా నాలుగో సారి సీఎం అయిన శ్రీ చంద్రబాబు నాయుడు గారికి, హ్యాట్రిక్ కొట్టిన మా బాలకృష్ణ గారికి, పిఠాపురం ఎమ్మెల్యే శ్రీ పవన్ కళ్యాణ్ గారికి హార్టీ కంగ్రాజులేషన్స్. చాలా సంతోషంగా వుంది. రిజల్ట్స్ వచ్చేశాయి. ఒక పండగ వాతావరణం స్టార్ట్ అయ్యింది. జూన్ 7న మనమే అంటూ మరో పండగ స్టార్ట్ అవుతోంది. దాని తర్వాత 27 కల్కి. మరో పండగ వాతావరణం. ఇక నుంచి అన్ని మంచి రోజులే. శ్రీరామ్ మనమే కథ ఎప్పడో చెప్పారు. యాక్చువల్లీ నేను వేరే కథ చేయాలి. అయితే వరుసగా సీరియస్ సినిమాలు చేసేస్తున్నానని నాకే అనిపించింది. అందరూ కనబడినపుడు మహానుభావుడు, ఎక్స్ ప్రెస్ రాజా, రన్ రాజా రన్ లాంటి ఎంటర్ టైనర్స్ చేయమని కోరేవారు. నాకూ ఎప్పడూ కొత్తగా చేయాలనే వుంటుంది. కథల్లో క్యారెక్టరైజేషనే కొత్తగా వుంటుంది. మనమే లో అలాంటి కొత్త క్యారెక్టరైజేషనే వుంది. మంచి కథ చేయాలి, ఎంటర్ టైన్నింగ్ గా వుండాలని అనుకున్నాం. అన్నీ సినిమాలు కాదని ఈ సినిమాని ఎంచుకోవడానికి కారణం ఒక బ్యూటీఫుల్ పాయింట్ టైం గురించి. మనిషి మనిషికి ఇవ్వగలిగే గొప్ప గిఫ్ట్ టైం. ఈ సినిమాలో శ్రీరామ్ ఆదిత్య ఈ పాయింట్ ని చాలా చక్కగా చెప్పారో చూస్తారు. లాస్ట్ 40 మినిట్స్ మిమ్మల్ని ఇంకో ప్రపంచంలోకి తీసుకెళ్తారు. ఓన్లీ ఎంటర్ టైన్మెంట్ కి ఓ మంచి సినిమా తీయాలని చేశాం. ఎట్టిపరిస్థితిలో డిస్సాపాయింట్ చేయనివ్వం. ఈ సినిమా ఖచ్చితంగా బ్లాక్ బస్టర్ అయ్యి తీరుతుంది. ఇందులో ఎటువంటి సందేహం లేదు. సినిమా సక్సెస్ పార్టీ పిఠాపురంలో జరగాలని నా కోరిక. సక్సెస్ కొట్టిన తర్వాత పిఠాపురంలో కలుస్తాం. మా డైరెక్షన్ డిపార్ట్మెంట్, రైటర్స్ కి థాంక్స్. కృతి గారు ఫస్ట్ టైం ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గా వచ్చారు. చాలా చక్కగా చేశారు. ఐ థింక్ యువర్ డాడ్ ఈజ్ వెరీ ప్రౌడ్. ఆయన మొహంలో ఆనందం కనిపిస్తోంది. ఇలాంటి మంచి సినిమాలు బాగా తీయాలని కోరుకుంటున్నాను. మారుతి గారు, కిషోర్ గారు, శివ నిర్వాణ గారు, సాయి రాజేష్ గారు థాంక్స్ ఫర్ కమింగ్. 35 సినిమాలు, 20 ఏళ్ళు ఎలా అయ్యిందో తెలీదు. నాన్న గారు దీని గురించి మాట్లాడుతుంటే చాలా ఎమోషనల్ గా అనిపించింది. ఐయాం వెరీ ప్రౌడ్ అఫ్ మై ఫిల్మోగ్రఫీ. ఈ సందర్భంగా హిట్లుకి ఫ్లాపులకి సంబంధం లేకుండా నాతో సినిమాలు తీసుకున్న డైరెక్టర్స్, ప్రొడ్యూసర్స్ కి, జన్మనిచ్చిన తల్లితండ్రులకు, ఫ్రండ్స్, ఫ్యామిలీ మెంబర్స్ కి ముఖ్యంగా ప్రేక్షకులందరికీ శిరస్సు వంచి పాధాబివందన. ఛాన్స్ కోసం ఫోటోలు పట్టుకొని ఆఫీస్ లు చుట్టూ తిరిగిన రోజులు గుర్తున్నాయి. ఈ రోజు ఆ కళామతల్లి, ఇండస్ట్రీ ఇంత ఇచ్చిందంటే రియల్లీ గ్రేట్ ఫుల్. స్వామీ శరణం. చాలా ఎమోషన్ గా వుంది. ఇట్స్ గుడ్ ఫీలింగ్. ఇరవైఏళ్ళు పట్టింది ఒక స్టార్ స్టేటస్ రావడానికి. 'ఛార్మింగ్ స్టార్' అనే టైటిల్ ఇచ్చిందుకు విశ్వగారికి చాలా థాంక్స్. నాతో పాటు జర్నీ చేసిన నా టీం అందరికీ థాంక్స్. వంశీ శేఖర్ పీఆర్వో కంటే మా డార్లింగ్స్. మేమంతా ఒకేసారి స్టార్ట్ అయ్యాం. వాళ్ళ ఫస్ట్ సినిమా, నా సినిమా 'కో అంటే కోటీ' తో మొదలై వారు పీఆర్వోలు అయ్యారు. ఈ రోజు వన్ అఫ్ ది బిగ్గెస్ట్ కంపెనీలా అయ్యారు. ఐయాం సో ప్రౌడ్ అఫ్ యూ డార్లింగ్స్.

# రకుల్ ప్రీత్ సింగ్ బ్యాక్ టు కెమెరా..

తెలుగులో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ మూవీతో సూపర్ హిట్ అందుకుంది రకుల్ ప్రీత్ సింగ్ జూనియర్ ఎన్టీఆర్, రాంచరణ్, మహేశ్ బాబు, రవితేజ, నాగార్జున లాంటి టాలీవుడ్ స్టార్ హీరోలతో నటించి వన్ ఆఫ్ ది లీడింగ్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగింది. రకుల్ ఈ ఏడాది ఫిబ్రవరిలో యాక్టర్ కమ్ ప్రొడ్యూసర్ జాకీభగ్నానీ (బాయ్ ఫ్రెండ్)తో వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టిందని తెలిసిందే. కాగా పెండ్లి తర్వాత ప్రొఫెషనల్ కమిట్‌మెంట్స్‌తో మళ్లీ బిజీ అయిపోయినట్టు తాజా అప్‌డేట్ చెప్పకనే చెబుతోంది. దే దే ప్యార్ దే రకుల్ ప్రీత్ సింగ్ కెరీర్‌లో వన్ ఆఫ్ ది బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచిందని తెలిసిందే. ఈ మూవీలో అజయ్ దేవ్‌గన్ ప్రియురాలిగా కనిపించింది రకుల్. అకివ్ అలీ డైరెక్ట్ చేసిన ఈ చిత్రం మంచి వసూళ్లు రాబట్టింది. కాగా ఈ మూవీకి సీక్వెల్ De De Pyar De 2 ఇప్పటికే లాక్ చేశారని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. తాజాగా సీక్వెల్ షూటింగ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. నేడు ముంబైలో షూటింగ్ షురూ అవగా.. రకుల్ ప్రీత్ సింగ్ షూట్‌లో జాయిన్ అయింది. టీ సిరీస్ నిర్మిస్తున్న ఈ మూవీలో అజయ్‌దేవ్‌గన్‌తోపాటు అనిల్ కపూర్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. సీక్వెల్‌లో రకుల్ ప్రీత్ సింగ్ ఈ ఇద్దరు స్టార్ హీరోలతో రొమాన్స్ చేయబోతుందట. ఫస్ట్ పార్టులో 50స్‌లో ఉన్న వ్యక్తి 20స్‌లో ఉన్న అమ్మాయితో ప్రేమలో పడితే ఎలా ఉంటుందని చూపించగా.. సీక్వెల్‌లో డైరెక్టర్ ఎలాంటి స్టోరీ చూపించబోతున్నారన్నది ఆసక్తికరంగా మారింది.







# శర్వారి ప్రధాన పాత్రలో నటిస్తోన్న 'ముంజ్యా'లో బాహుబలికి కనెక్షన్

శర్వారి ప్రధాన పాత్రలో నేష్ విజన్ బ్లాక్‌బస్టర్ హారర్ కామెడీ యూనివర్స్‌లో భాగంగా 'ముంజ్యా' అనే చిత్రం రాబోతోంది. ఈ చిత్రంలో సత్య రాజ్ ప్రముఖ పాత్రను పోషించారు. ఇక బాహుబలితో కట్టప్పగా ఫేమస్ అయిన సత్య రాజ్‌తో పని చేసిన అనుభవం గురించి శర్వారి చెబుతూ ఎంతో ఎగ్జైట్ అయ్యారు. 'ఎస్ఎస్ రాజమౌళి అంటే నాకు ఎంతో ఇష్టం. ఆయన తీసిన బాహుబలికి వీరాభిమానిని. ఆ మూవీని ఎన్నో సార్లు చూశాను. ఇక ఈ చిత్రంలో కట్టప్పగా చేసిన సత్య రాజ్ గారితో స్క్రీన్ షేర్ చేసుకోబోతోన్నానని తెలియడంతో ఎంతో సంతోషించాను. సెట్‌లో మొదటి రోజు నుండి సత్యరాజ్ అంకితభావం, నైపుణ్యాన్ని చూసి ఆశ్చర్యపోయాను. ఆయన్నుంచి చాలా నేర్చుకున్నాను. సత్యరాజ్ సర్‌ని సెట్‌లో చూడటంతో ప్రతిరోజూ యాక్టింగ్ వర్క్‌షాప్‌కు హాజరైనట్లుగా ఉంది. అతని బహుముఖ ప్రజ్ఞ, సహనం, పరిపూర్ణ ప్రతిభ అన్నిటినీ మించిపోయింది. అది కామిక్ సీన్ అయినా లేదా ఇంటెన్స్ మూమెంట్ అయినా, సత్యరాజ్ సర్ ఎంతో సెటిల్‌డ్‌గా ప్రతి సన్నివేశానికి జీవం పోశారు. ఆయనతో కలిసి మళ్లీ పని చేయాలని ఉంది. అలాంటి అవకాశం మళ్లీ వస్తుందని ఆశిస్తున్నాను' అని అన్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.